www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00



మార్కెట్ల జోరుకు బ్రేక్! 7

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 61 | గురువారం | 8 అక్టోబర్, 2026



ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం 2

- గర్భిణి, చిన్నారితో సహా మరో ముగ్గురు దుర్మరణం, ఎనిమిది మందికి గాయాలు
- సీమాపురిలో ఘటన



దసరాకు 7వేల ప్రత్యేక బస్సులు 2

- 30మంది బృందంగా బుక్ చేసుకుంటే ఇంటివద్దకే బస్సు
- కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, హాస్టళ్లు, కళాశాలలకు పికప్ సదుపాయం
- 9, 10, 16, 17న భారీ రద్దీ అంచనా
- తిరుగు ప్రయాణాలకు 25, 26న ప్రత్యేక సర్వీసులు



ప్రజల ఆశీస్సులే నా బలం

2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం

- దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం
- 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోడీ భావోద్వేగం

25 ఏళ్లుగా నిరంతర ప్రజాసేవ అందిస్తానని ఎప్పుడూ ఊహించలేదు. ప్రజా ఆశీర్వాద బలమే నన్ను ఇంతకాలం నడిపించింది. ప్రజలు అందించిన నిరంతర ఆశీస్సులు, విశ్వాసం వల్లే ఈరోజు ఈస్థాయికి చేరుకున్నా. నాకు ఆశీస్సులు అందించిన దేశ ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. ప్రజలు, భగవంతుడి ఆశీస్సులతో దేశానికి మరింత సేవ చేస్తా.

– 25ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: 25ఏళ్లుగా నిరంతర ప్రజాసేవ చేస్తానని 2001లో తాను ఊహించలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రజలు అందించిన నిరంతర ఆశీస్సులు, విశ్వాసమే తనను ఇంతకాలం నడిపించాయని పేర్కొన్నారు. ప్రభుత్వాధినేతగా 25ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా తన రాజకీయ ప్రయాణాన్ని, ప్రజలతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మోదీ.. ఈ సందర్భంగా దేశ ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. ప్రజలు, భగవంతుడి ఆశీస్సులతో భవిష్యత్తులోనూ దేశానికి మరింత సేవ చేస్తానని తెలిపారు.

గుజరాత్ సీఎంగా తొలి అడుగు

2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేసిన రోజులను మోదీ గుర్తు చేసుకున్నారు. అప్పటివరకు ఎన్నికైన పదవిలో పని చేసిన అనుభవం తనకు లేదని చెప్పారు. అయినప్పటికీ ప్రజా జీవితంలో కీలక బాధ్యతలు చేపట్టాల్సి వచ్చిందన్నారు. అప్పట్లో 25 ఏళ్లపాటు ప్రభుత్వాధినేతగా కొనసాగుతానని తాను ఊహించలేదని తెలిపారు. గుజరాత్ సీఎంగా వరుసగా పలు పర్యాయాలు పనిచేసిన అనంతరం 2014లో ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి వరుసగా మూడు పర్యాయాలు ప్రధానిగా కొనసాగుతున్నారు. తన రాజకీయ ప్రస్థానంలో సాధించిన ప్రతి విజయానికి ప్రధాన కారణం ప్రజలేనని మోదీ స్పష్టం చేశారు. తాను ప్రస్తుతం ఉన్న స్థాయికి చేరుకోవడంలో కోట్లాది భారతీయుల విశ్వాసం, పార్టీ కోసం కష్టపడిన లక్షలాది కార్యకర్తల శ్రమ కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.

ప్రతి అనుభవం ఓ పాఠమే

25ఏళ్ల ప్రస్థానాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే తనలో మొదట కలిగే భావన కృతజ్ఞతేనని మోదీ అన్నారు. జీవితంలో ఎదురైన ప్రతి వ్యక్తి, ప్రతి సంఘటన తనకు ఏదో ఒక పాఠం నేర్పిందని చెప్పారు. విజయాలు వినయంగా ఉండటం నేర్పాయని, ఓటములు, ఎదురుదెబ్బలు తిరిగి నిలబడే శక్తిని ఇచ్చాయని పేర్కొన్నారు. శ్రేయోభిలాషులు ప్రోత్సహించగా.. విమర్శకులు తనను తాను మరింత లోతుగా పరిశీలించుకునే అవకాశం కల్పించారని తెలిపారు. మద్దతు ఇచ్చినవారు విశ్వాసం శక్తిని తెలియజేస్తే.. వ్యతిరేకించినవారు ప్రజాస్వామ్య బలాన్ని అర్థం చేసుకునేలా చేశారని వివరించారు. 25 ఏళ్ల ప్రస్థానం గతాన్ని గుర్తుచేసుకునే సందర్భం మాత్రమే కాదని.. భవిష్యత్తు కోసం కొత్త సంకల్పాన్ని పునరుద్ఘాటించాల్సిన సమయమని చెప్పారు.

'సేవే లక్ష్యంగా పనిచేస్తున్నాం'

తాను ఎప్పుడూ ఒంటరిగా భావించలేదని మోదీ అన్నారు. దేశ సాంస్కృతిక ఆత్మను కాపాడుతూ భారత్‌కు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న అనేకమంది స్వయంసేవకులు, కార్యకర్తలు తనకు అండగా ఉన్నారని తెలిపారు. దేశసేవ, మానవాళికి సేవే లక్ష్యంగా పని చేస్తున్న ప్రతి స్వయంసేవకుడు, కార్యకర్తకు గౌరవంగా నమస్కరిస్తున్నట్లు చెప్పారు. వేదాల నుంచి స్వామి వివేకానంద వరకు గొప్ప ఆలోచనలను ఆచరిస్తూ వచ్చిన భారతదేశం తనకు సేవ చేసే శక్తిని అందిస్తోందని పేర్కొన్నారు. వేల ఏళ్ల తరువాయి 2లో



ఢిల్లీ ఉద్రిక్తం

జంతర్‌మంతర్‌కు విపక్ష ఎంపీల ర్యాలీ

- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే
- లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ
- ఈసీ వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆగ్రహం 2



సీఈసీతో రాజీనామా చేయించాలి 2

- రాహుల్ ఆందోళనను అడ్డుకోవడం నిరంకుశత్వానికి నిదర్శనం
- సర్‌ను తక్షణమే నిలిపివేయాలి.. ఓటు హక్కును హరిస్తున్నారు: సీఎం రేవంత్

ఆర్‌బీఐ వడ్డింపు!

రెపో రేటు 5.50 శాతానికి పెంపు

- రెపో రేటు 5.50 శాతానికి పెంపు
- దాదాపు నాలుగేళ్ల తర్వాత ఇదే తొలిసారి
- ద్రవ్యోల్బణం, చమురు భయాలతో కఠిన వైఖరి
- ఇక కోతలకు అవకాశం లేదని స్పష్టం

ముంబై: ద్రవ్యోల్బణం పెరుగుతుండడం, రూపాయి విలువ క్షీణించడం, ముడిచమురు ధరలు ఎగబాకడంతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేటును పెంచింది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత ఆర్‌బీఐ రేటును పెంచడం ఇదే తొలిసారి. ఆరుగురు సభ్యుల ద్రవ్య విధాన కమిటీ ఈ నిర్ణయాన్ని ఏకగ్రీవంగా తీసుకోగా, విధాన వైఖరిని 'తటస్థం' నుంచి 'క్రమబద్ధమైన కఠినతరం'గా మార్చే ప్రతిపాదనకు 4:2 మెజారిటీతో ఆమోదం లభించింది. సమీప భవిష్యత్తులో వడ్డీరేట్ల కోతకు అవకాశం లేదని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. పరిస్థితులను బట్టి తదుపరి చర్య రేటు పెంపు లేదా విరామం మాత్రమే ఉంటుందని తెలిపారు. మరిన్ని పెంపుల సమయం, పరిమాణం ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి, నరఫరా సమస్యల తీవ్రతపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరి, ఆర్‌బీఐ నిర్దేశించిన 4 శాతం లక్ష్యాన్ని వరుసగా మూడో నెల అధిగమించింది. ఆహారం, ఇంధన ధరలు, బలహీన రుతుపవనాలు, ఎల్‌నినో పరిస్థితులు, అంతర్జాతీయ చమురు ధరల అస్థిరతతో ద్రవ్యోల్బణ ముప్పు పెరిగిందని ఆర్‌బీఐ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణ అంచనాను 5 శాతం నుంచి 5.2 శాతానికి పెంచింది. సెప్టెంబరులో భారత క్రూడ్ బాస్కెట్ సగటు ధర బ్యారెల్‌కు 116.1 డాలర్లకు చేరిందని వెల్లడించింది.



వృద్ధి అంచనా పెంపు


2026–27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 6.7 శాతం నుంచి 7.1 శాతానికి ఆర్‌బీఐ పెంచింది. తొలి త్రైమాసికంలో ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి చెందిందని, తయారీ, సేవలు, మూలధన వస్తువుల ఉత్పత్తి, రుణ వృద్ధి, వినియోగంలో మెరుగుదల కనిపించిందని తెలిపింది.

రుణాలపై స్వల్ప ప్రభావం

ప్రస్తుతం 18 శాతానికి పైగా ఉన్న బ్యాంకుల రుణ వృద్ధి కొంత మందగించే అవకాశం ఉన్నప్పటికీ, ఆర్థిక విస్తరణపై పెద్దగా ప్రభావం ఉండదని ఆర్‌బీఐ పేర్కొంది. రేటు పెంపు ప్రభావం రుణాలపై పూర్తిగా కనిపించేందుకు సాధారణంగా రెండు త్రైమాసికాల సమయం పడుతుందని డిప్యూటీ గవర్నర్ తెలిపారు.

రూపాయికి అండ

డాలర్‌తో రూపాయి 43 పైసలు క్షీణించి రూ.96.78 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.96.96 స్థాయికి పడిపోయింది. రూపాయి తన సరైన విలువకు చేరేలా స్థిరీకరించేందుకు ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటుందని గవర్నర్ తెలిపారు. మరోవైపు సెన్సెక్స్ 429 పాయింట్లు నష్టపోయి 72,638.70 వద్ద, నిఫ్టీ 173 పాయింట్లు తగ్గి 22,603.05 వద్ద ముగిశాయి.



రసాయన శాస్త్రంలో ఇద్దరికి నోబెల్ 6

- అసిమెట్రిక్ ఆర్గానిక్ సింథసిస్‌లో విశేష పరిశోధనలకు గుర్తింపు
- ఆటోకెటాలిసిస్, నాన్‌లీనియర్ ప్రభావాలపై పరిశోధనకు పురస్కారం

రూ.1,108 కోట్లతో ఓంకారేశ్వరాలయం


- పరిపాలన అనుమతి మంజూరు చేసిన రేవంత్ సర్కార్
- మూసీ పునరుజ్జీవంలో భాగంగా మంచిరేవులలో వీరభద్రస్వామి గుట్టపై నిర్మాణం
- అభివృద్ధి పనుల పర్యవేక్షణకు కమిటీ
- ఓంకారేశ్వరాలయం నమూనా చిత్రం 2



మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా మంచిరేవులలోని వీరభద్రస్వామి గుట్టపై రూ.1,108.27 కోట్లతో ఓంకారేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

2.43 కోట్ల ఓట్లు ఖరారు 2

- సర్ తుది జాబితాపై స్పష్టత
- ఫిర్యాదులు, అభ్యంతరాల గడువు ముగింపు.. 26.14 లక్షల ఓట్లపై విచారణ
- నవంబరు 9న తుది ఓటర్ల జాబితా
- పాత జాబితాతో పోలిస్తే 69 లక్షల వరకు ఓట్లు తగ్గే అవకాశం





వాస్తవాలు తెలుసుకుని విమర్శించాలి 2

- హరీశ్‌రావుకు విమర్శల ముందు నిజాలు తెలుసుకునే ఓపిక ఉండాలి
- శ్రీశైలం నీటిని బీర్ల ఉత్పత్తికి వాడతామనలేదు
- మద్యం అమ్మకాలను ఎల్‌నినోతో ముడిపెట్టడం విడ్డూరం: జూపల్లి

దసరాకు 7 వేల ప్రత్యేక బస్సులు

ప్రజానావ, హైదరాబాద్: దసరా పండుగ నేపథ్యంలో స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు బుధవారం ప్రకటించింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వివిధ జోన్ల నుంచి ప్రత్యేక సర్వీసులను అందుబాటులోకి తీసుకురానుంది. కరీంనగర్ జోన్ పరిధిలో అత్యధికంగా 3,533 ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ఇందులో ఆదిలాబాద్ నుంచి 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1,175, వరంగల్ 530, ఖమ్మం 678 సర్వీసులు ఉన్నాయి. హైదరాబాద్ జోన్ పరిధిలో 2,155 బస్సులు అందుబాటులో ఉంటాయి. వీటిలో మహబూబ్‌నగర్ 645, మెదక్ 255, నల్గొండ 815, రంగారెడ్డి 440 సర్వీసులు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి మరో 1,312 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

9, 10, 16, 17 తేదీల్లో రద్దీ

దసరా సందర్భంగా ఈ నెల 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. పండుగ అనంతరం స్వస్థలాల నుంచి తిరిగి హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వచ్చే వారి కోసం ఈ నెల 25, 26 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

30 మంది ఉంటే.. ఇంటివద్దకే బస్సు

ప్రయాణికుల సౌకర్యార్థం ఈసారి టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాలనీలు, టౌన్‌షిప్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, హాస్టళ్లు, కళాశాలల నుంచి కనీసం 30 మంది ఒక బృందంగా ఏర్పడి ముందస్తుగా బుక్ చేసుకుంటే.. వారి వద్దకే బస్సును పంపి పికప్ చేసే సదుపాయం కల్పించింది. దీంతో ప్రయాణికులు బస్టాండ్లకు వచ్చి ఇబ్బందులు పడకుండా నేరుగా తమ ప్రాంతం నుంచే స్వగ్రామాలకు వెళ్లే అవకాశం కలగనుంది.

సవరించిన ఛార్జీలతో ప్రత్యేక సర్వీసులు

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సవరించిన టికెట్ ధరలను ప్రత్యేక బస్సు సర్వీసులకు వర్తింపజేయనున్నట్లు టీజీఎస్ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రయాణికులు ముందస్తుగా బుకింగ్ చేసుకుని ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ
ఆలోచన లేదు

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే విద్యుత్ డిమాండ్ అత్యధిక స్థాయికి చేరిందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 19,892 మెగావాట్లకు చేరిందని వెల్లడించారు. దాదాపు 20వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నప్పటికీ ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా ప్రజలకు అవసరాలకు అనుగుణంగా సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాపై కొందరు నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని భట్టి విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడానికి ఎలొనొసో ప్రభావం కారణమని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు.

ప్రైవేటీకరణ ఆలోచనే లేదు

డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోలను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని భట్టి స్పష్టం చేశారు. విద్యుత్ సంస్థలను లిస్టెడ్ కంపెనీలుగా మార్చే ప్రతిపాదన కూడా లేదన్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు విద్యుత్ సంస్థలపై అలా మాట్లాడటం సరికాదని వ్యాఖ్యానించారు. విద్యుత్ సిబ్బందిని కించపరిచేలా రాజకీయ నేతలు విమర్శలు చేయడం తగదన్నారు. ఊహాజనిత ఆరోపణలు, వ్యాఖ్యలు రాష్ట్రానికే నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు.

యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గు ఎక్కడి నుంచి?

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విషయంలో గత ప్రభుత్వ నిర్ణయాలను భట్టి ప్రశ్నించారు. పవర్ ప్లాంట్ నిర్మాణానికి ముందే అవసరమైన బొగ్గు లభ్యతను నిర్ధారించుకోవాల్సి ఉంటుందని అన్నారు. సింగరేణి నుంచి యాదాద్రి ప్లాంట్‌కు గ్రేడ్–9 బొగ్గు సరఫరా చేస్తామని హామీ ఇచ్చినా, అందుకు సంబంధించిన ఒప్పందం చేసుకున్న తర్వాత కూడా బొగ్గు సరఫరా చేయలేదని ఆరోపించారు. అసలు బొగ్గు కేటాయింపులు లేకుండానే యాదాద్రి పవర్ ప్లాంట్‌ను నిర్మించారని భట్టి విమర్శించారు.



ప్రజల ఆశీస్సులే నా బలం

(మొదటిపేజీ తరువాయి)

సాంస్కృతిక వారసత్వం ఉన్న దేశానికి సేవ చేసే అవకాశం లభించడం గర్వకారణమన్నారు. భారత్ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని మోదీ అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్‌ను సాధించాలనే లక్ష్యంపై ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశారు. భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, వివిధ రంగాల్లో స్వయంసమృద్ధి సాధించడం, ప్రపంచ ఉత్పాదక రంగానికి ప్రధాన కేంద్రంగా మార్చడం తమ లక్ష్యాల్లో ఉన్నాయని తెలిపారు.భారత్‌లో తయారయ్యే విమానాల గురించి ప్రపంచం మాట్లాడే రోజు త్వరలో వస్తుందని అన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో సరికొత్త శిఖరాలను అధిరోహించడంతోపాటు దేశంలో ప్రతిష్ఠాత్మక ఒలింపిక్ క్రీడలను విజయవంతంగా నిర్వహించే స్థాయికి చేరుకుంటామని పేర్కొన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం పూర్తయిన సందర్భంగా మోదీ దిల్లీలోని సరోజినీనగర్‌లో ఉన్న శ్రీ వినాయక మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న తన కుటుంబ సభ్యులంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. విఘ్నహర్త ఆశీస్సులతో అందరికీ మేలు జరగాలని, దేశం నిరంతర ప్రగతి పథంలో సాగాలని ఆకాంక్షించారు.

ఢిల్లీలో కుప్పకూలిన
5 అంతస్తుల భవనం

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని సీమాపురిలో ఐదంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో గర్భిణి, ఒక చిన్నారి ఉండడం స్థానికంగా అందర్నీ కలచివేస్తుంది. మరో ఎనిమిది మంది ఈ ప్రమాదంలో గాయపడ్డారు. పలువురు భవన శిథిలాల కింద చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో భవనం పక్కనే ఉన్న ఇళ్లు కూడా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ బృందాలు ఘటనాస్థలంలో సహాయక చర్యలను ముమ్మరం చేశారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిలో కొంతమందిని సురక్షితంగా బయటకు తీశారు. దిల్లీలో నిన్న సంభవించిన భూ ప్రకంపనలు కారణంగానే భవనం కూలి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఢిల్లీలో ఉద్రిక్తం



న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష ఎంపీలు మరోసారి ఆందోళనకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ వాద్రా సహా ఇండియా కూటమి ఎంపీలు తొలుత ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. అనంతరం బస్సుల్లో జంతర్‌మంతర్ వైపు బయలుదేరారు. బుధవారం ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో పోలీసులు తమను అడ్డుకున్నారని రాహుల్‌గాంధీ తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ పదవిలో కొనసాగేందుకు అర్హత లేదని ఆయన ఆరోపించారు. ఆయన రాజీనామా చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తనపై ఎలాంటి కేసులు పెట్టినా వాటిని పతకాలుగా భావిస్తానని వ్యాఖ్యానించారు.

రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారు: ఖర్గే

మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఎన్నికల సంఘం వ్యవహారాలను దేశ ప్రజలకు వివరిస్తామని, కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లకు తాము తలొగ్గబోమని చెప్పారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు తాము నిరసన తెలిపేందుకు వెళ్లడం లేదని, అనుమతులు ఉన్న ప్రైవేటు బస్సులో ప్రయాణిస్తున్నామని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం తెలిపారు. చట్టబద్ధమైన అనుమతులు, లైసెన్సులు ఉన్న బస్సులో ప్రయాణించే హక్కు కూడా తమకు లేదా? అని ప్రశ్నించారు. తాము ఎక్కడికి వెళ్తున్నామో ముందుగానే ప్రభుత్వానికి చెప్పాల్సిన అవసరం ఏముందని నిలదీశారు.

జంతర్‌మంతర్ వద్ద భారీ భద్రత

విపక్ష ఎంపీలు జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పోలీసులు అక్కడ భద్రతను కట్టుదిట్టం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ వాద్రాతో పాటు పలువురు విపక్ష ఎంపీలు బస్సుల్లో అక్కడికి బయలు దేరారు. మంగళవారం ఈసీ కార్యాలయం వద్ద విపక్షాలు చేపట్టిన ఆందోళన నేపథ్యంలో అక్కడ కూడా భారీగా భద్రతా బలగాలను మోహరించారు. దిల్లీలో ఇతర ప్రాంతాల్లో నిరసనలకు పోలీసులు అనుమతించక పోవడంతోనే జంతర్‌మంతర్‌కు వెళ్తున్నామని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కల్పిస్తోందని పేర్కొన్నారు.

'300 మంది ఎంపీలం వెళ్లినా అడ్డుకున్నారు'

''మంగళవారం ఈసీని కలిసేందుకు దాదాపు 300 మంది ఎంపీలం వెళ్లాం. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు కలిసి ఎన్నికల సంఘాన్ని కలవాలనుకున్నాం. కానీ మమ్మల్ని కలిసేందుకు ఈసీ నిరాకరించింది. దిల్లీ పోలీసులు కూడా అడ్డుకున్నారు. ఇప్పుడు నిర్ణీత నిరసన ప్రదేశమైన జంతర్‌మంతర్‌కు వెళ్లి ఆందోళన చేపడతాం'' అని రాహుల్‌గాంధీ తెలిపారు.జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.



సీఈసీతో మోడీ రాజీనామా చేయించాలి

న్యూఢిల్లీ/ప్రజానావ, హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌తో ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. దిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రజాస్వామ్యయుతంగా చేపట్టిన ఆందోళనను అడ్డుకోవడం మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు.రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీని పోలీసులు అరెస్టు చేసిన అనంతరం వారిని కలిసేందుకు రేవంత్‌రెడ్డి, కేరళ కాంగ్రెస్ నేత సతీశన్ వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ చర్యను సీఎం తీవ్రంగా తప్పుపట్టారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కూడా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని విమర్శించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను తక్షణమే నిలిపి వేయాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల ఓటు హక్కును ఎన్నికల సంఘం హరిస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ వర్గాల ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్ర జరుగుతోందని విమర్శిం చారు. ఎన్నికల్లో గెలిచేందుకు గతంలో ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను ఉపయోగిం చుకున్నారని.. ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని ప్రయోగిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.''ఇది కాంగ్రెస్ సమస్య కాదు.. దేశ ప్రజల సమస్య. ప్రధాని మోదీ భావోద్వేగాలకు గురికాకుండా జ్ఞానేశ్‌కుమార్‌తో రాజీనామా చేయించాలి. రాజ్యాంగాన్ని కాపాడేందుకు, పేద ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల సంఘాన్ని ఉపయోగించాలి. లేదంటే ఈ ఉద్య మాన్ని ఆపేది లేదు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో రోడ్డు నుంచి పార్లమెంటు వరకు పోరాడతాం. కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు ఇండియా కూటమి నేతలంతా రోడ్డెక్కుతారు'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

రాహుల్‌కు మద్దతుగా జగ్గారెడ్డి దీక్ష

రాహులకి మద్దతుగా దీక్ష చేపడతానని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ప్రకటించారు. భాజపా, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా రాహుల్ పోరాడుతున్నారన్నారు. ఆయనకు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దవుత్తున రోడ్డుపైకి వచ్చి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ ఎన్ని రోజులు పోరాటం చేస్తే అన్ని రోజులూ తాను దీక్ష కొనసాగిస్తానని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

2.43 కోట్ల ఓట్లు ఖరారు



ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో కీలకమైన ఫిర్యాదులు, అభ్యంతరాల గడువు బుధవారంతో ముగిసింది. కొత్త ఓటర్ల నమోదుకు కూడా అవకాశం లేకపోవడంతో నవంబరు 9న విడుదల చేయనున్న తుది జాబితాలో ఎంతమంది ఓటర్లు ఉండనున్నారనే దానిపై ఓ అంచనా ఏర్పడింది.సర్ ముసాయిదా జాబితా అనంతరం 1,71,99,536 మంది ఓటర్ల వివరాల్లో ఎలాంటి లోపాలు గుర్తించకపోవడంతో వారిని నేరుగా తుది జాబితాలో చేర్చారు. మరోవైపు అనామలీస్, అన్‌మ్యాపింగ్ కారణాలతో సుమారు 93 లక్షల మందికి నోటీసులు జారీ చేశారు. వీరిలో ఇప్పటివరకు 71,23,526 మంది సమర్పించిన పత్రాలు సక్రమంగా ఉన్నట్లు తేలడంతో వారు తుది జాబితాలో చోటు దక్కించుకున్నారు. దీంతో బుధవారం నాటికి మొత్తం 2,43,23,059 మంది ఓటర్లు నవంబరు 9న ప్రకటించే తుది జాబితాలోకి చేరేందుకు అర్హత సాధించారు. నోటీసులు అందుకున్న మరో 21,64,654 మంది ఓటర్లపై ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. అదేవిధంగా ఫారం–6 ద్వారా కొత్త ఓటర్ల నమోదుకు వచ్చిన సుమారు 4.50 లక్షల దరఖాస్తులపైనా అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది.ఈ రెండు కేటగిరీల్లోని మొత్తం 26.14 లక్షల మంది ఓటర్లపై విచారణ పూర్తయిన తర్వాతే తుది జాబితాలో ఎంతమందికి చోటు లభిస్తుందనే దానిపై పూర్తి స్పష్టత రానుంది.

73.39 లక్షల ఓట్ల తొలగింపు

సర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు రాష్ట్రంలో 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్యూమరేషన్ పత్రాల సమర్పణ అనంతరం 2,64,87,213 మంది ముసాయిదా జాబితాలో చోటు దక్కించుకున్నారు. చిరునామాలో అందుబాటులో లేకపోవడం, శాశ్వతంగా వలస వెళ్లడం, మరణించడం, డూప్లికేట్ (ఏఎస్‌డీడీ) వంటి కారణాలతో 73,39,235 మంది ఓట్లను తొలగించారు.కొత్త ఓటర్ల నమోదుకు ఫారం–6 ద్వారా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. ప్రస్తుతం విచారణలో ఉన్న 26.14 లక్షల మందిని, ఇప్పటికే తుది జాబితాకు అర్హత సాధించిన 2.43 కోట్ల మందిని కలిపితే మొత్తం ఓటర్ల సంఖ్య సుమారు 2.69 కోట్లకు చేరే అవకాశం ఉంది.

69 లక్షల వరకు తగ్గే అవకాశం

పాత ఓటర్ల జాబితాతో పోలిస్తే సర్ ప్రక్రియ పూర్తయ్యే నాటికి రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య సుమారు 69 లక్షల వరకు తగ్గే అవకాశం కనిపిస్తోంది. అయితే విచారణలో ఉన్న 26.14 లక్షల మంది ఓటర్ల అర్హతపై నిర్ణయం తీసుకున్న తర్వాతే తుది సంఖ్యపై పూర్తి స్పష్టత రానుంది.

పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా శిరసావహిస్తా

ప్రజానావ, కరీంనగర్: తెలంగాణ బీజేపీలో తనకు త్వరలో కీలక బాధ్యతలు అప్పగించనున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. బీజేపీ తనకు ఇప్పటికే ఎన్నో పదవులు, అవకాశాలు ఇచ్చిందని తెలిపారు. తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదని, పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని స్పష్టం చేశారు. కార్యకర్తగా పార్టీ కోసం పనిచేయడమే తనకు ముఖ్యమన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవా జ్యోతి' ర్యాలీలో బండి సంజయ్ మాట్లాడారు. కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పడం రాజకీయ డ్రామాలో భాగమేనని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకునే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు.

'ఓట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే

ఎన్నికల సంఘంపై కాంగ్రెస్, ఇతర విపక్షాలు చేస్తున్న విమర్శలను బండి సంజయ్ తప్పుబట్టారు. 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపించారు. 1946లో కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీలు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను ప్రధానిగా ప్రతిపాదించినప్పటికీ.. జవహర్‌లాల్ నెహ్రూను ప్రధానిని చేశారని పేర్కొన్నారు. దేశంలో బోగస్ ఓట్లు ఉన్నాయని గతంలో కాంగ్రెస్ నేతలే చెప్పారని, ఇప్పుడు వాటిని తొలగించే చర్యలను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు.

ప్రధాని మోదీకి ఓట్లు, సీట్లు చోరీ చేయాల్సిన అవసరం లేదని బండి సంజయ్ అన్నారు. కుటుంబం, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలతో మోదీకి సంబంధం లేదని పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని పనిచేస్తున్నారని తెలిపారు.

ఎన్నికల సంఘం బీజేపీ జేబు సంస్థ కాదు

కాంగ్రెస్ సహా కొన్ని పార్టీల ప్రచారాన్ని నమ్మి యువత మోసపోవద్దని బండి సంజయ్ సూచించారు. 2014కు ముందు, ప్రస్తుత భారతదేశ పరిస్థితులను పోల్చి చూడాలని కోరారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదని స్పష్టం చేశారు. రాజ్యాంగ సంస్థను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘాన్ని కలవాలంటే ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాలని రాహుల్ గాంధీకి సూచించారు. వందల మందితో వెళ్లి ఆందోళన చేస్తే పోలీసులు అడ్డుకోక ఏం చేస్తారని ప్రశ్నించారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని తెలిపారు.

రోహింగ్యాల ఓట్లపై ఆరోపణలు

తెలంగాణలో అక్రమ చొరబాటుదారుల ఓట్లపైనా బండి సంజయ్ ఆరోపణలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోనే 30 వేలకు పైగా రోహింగ్యాల ఓట్లు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ఎన్నికల జాబితాల పరిశీలన, ఎస్ఐఆర్ ప్రక్రియ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఊబకాయం చికిత్సలో ఔషధాలు, సర్జరీలపై ఆధారపడొద్దు



న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా ఊబకాయంతో బాధపడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ముఖ్యంగా చిన్నారులు, యుక్త వయసు పిల్లల్లో ఈ సమస్య గణనీయంగా పెరుగుతుండటంతో బరువు తగ్గించే ఔషధాలు, శస్త్రచికిత్సల వినియోగం కూడా అధికమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. పదేళ్లలోపు చిన్నారులకు బరువు తగ్గించే ఔషధాలను ఇవ్వకూడదని సూచించింది. ఈ వయసు పిల్లల్లో ఇలాంటి మందులు మెరుగైన ఫలితాలు ఇస్తాయనడానికి ప్రస్తుతం తగిన ఆధారాలు లేవని స్పష్టం చేసింది.

ప్రస్తుతం పదేళ్లకు పైబడిన పిల్లలు, యుక్త వయసు వారికే వినియోగానికి అనుమతి పొందిన కొన్ని ఊబకాయం నియంత్రణ ఔషధాలు అందుబాటులో ఉన్నాయని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. అయితే కొంతమంది వైద్యులు అనధికారికంగా చిన్నారులకు కూడా వాటిని సూచిస్తున్నట్లు పేర్కొంది. చిన్నారుల్లో ఊబకాయం తగ్గించే ఔషధాలపై పరిశోధనలు, పరీక్షలను తాము వ్యతిరేకించడం లేదని, పిల్లల కోసం ఇప్పటికే పలు క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయని వెల్లడించింది.

జీవనశైలిలో మార్పులే కీలకం

ఊబకాయం నియంత్రణకు ఔషధాలు లేదా శస్త్రచికిత్సలపై మాత్రమే ఆధారపడకుండా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి జీవనశైలి మార్పులపై దృష్టి పెట్టాలని డబ్ల్యూహెచ్‌వో సూచించింది. చిన్న వయసులోనే ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించడం ద్వారా భవిష్యత్తులో ఊబకాయం, దాని కారణంగా తలెత్తే అనారోగ్య సమస్యలను తగ్గించవచ్చని పేర్కొంది.

17 కోట్ల మంది చిన్నారులకు సమస్య

ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 17 కోట్ల మంది చిన్నారులు, యుక్త వయసు పిల్లలు ఊబకాయంతో బాధపడుతున్నట్లు అంచనా. వీరిలో దాదాపు ఏడు కోట్ల మంది ఐదేళ్ల నుంచి తొమ్మిదేళ్లలోపు వారే ఉన్నారు. 19 ఏళ్లలోపు వయసున్న వారిలో మరో 10 కోట్ల మందికిపైగా ఈ సమస్యతో బాధపడుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఊబకాయం వల్ల టైప్–2 మధుమేహంతో పాటు పలు ఇతర అనారోగ్య సమస్యల ముప్పు పెరుగుతుందని డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది.

రూ.1,108 కోట్లతో ఓంకారేశ్వరాలయం



ప్రజానావ, హైదరాబాద్: మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా మంచిరేవులలోని వీరభద్ర స్వామి గుట్టపై రూ.1,108.27 కోట్లతో ఓంకారేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రధాన దేవాలయ నిర్మాణానికి రూ. 598.98 కోట్లు, చుట్టూ భవనాలు, వసతుల కల్పన, ఇతర అభివృద్ధి పనులకు రూ.349.67కోట్లు, ఆల యాన్ని అనుసంధానిస్తూ మూసీ ఒడ్డున రూ.159.62 కోట్లతో రోడ్డు నిర్మాణానికి పరిపాలన అనుమతి ఇస్తూ పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ ఉత్తర్వులిచ్చారు.

సాంకేతిక కమిటీ ఏర్పాటు..

ఆలయ నిర్మాణ పనుల పర్యవేక్షణకు ప్రభుత్వం ఉన్నతస్థాయి సాంకేతిక కమిటీని నియమించింది. కమిటీ చైర్మన్‌గా రోడ్లు భవనాలశాఖ ఈఎన్‌సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్) ఉంటారు. ప్రజారోగ్యశాఖ ఈఎన్‌సీ కో–చైర్మన్‌గా, ఎంఆర్‌డీసీఎల్ ముఖ్య ఇంజినీరు(సీఈ) కన్వీనరుగా, దేవాదాయశాఖ సీఈ, ఆలయ శిల్పకళా నిపుణులు (స్థపతి) డాక్టర్ శివనాగిరెడ్డి, ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి సభ్యులుగా పనిచేయనున్నారు. డిజైన్లు, ప్రణాళిక ప్రకారం పనులు, ధరలను నిర్ణయించడం, అంచనా వ్యయాలకు సాంకేతిక ఆమోదం తెలపడం, టెండర్లు, ఇతరత్రా కార్యక్రమాలను ఈ కమిటీ నిర్వహిస్తుంది. మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధి సంస్థ(ఎంఆర్‌డీసీఎల్) రూపొందించిన డీపీఆర్(పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక) ప్రకారం.. మంచిరేవులలోని చారిత్రక వీరభద్రస్వామి, మచిలేశ్వరస్వామి ఆలయాల పక్కన 8 ఎకరాల్లో ఓంకారేశ్వరస్వామి ఆలయ సముదాయం నిర్మాణం కానుంది. అందులో శ్రీ వీరభద్ర–భద్రకాళి ఆలయం, శ్రీ లలితా మహా త్రిపురసుందరీదేవి, శ్రీ బాలగణపతి స్వామి, శ్రీ బాలసుబ్రహ్మణ్య స్వామి ఉపాలయాలుంటాయి. మహా మండపం, నంది మండపం, ప్రాకారాలు, రాజగోపురాలు, యాగశాల, పుష్కరిణి, ఆలయం దిగువ ఉన్న మూసీనదిలో ఎత్తయిన శివుని విగ్రహం, పలు అంతస్తుల్లో పార్కింగ్ కాంప్లెక్సు, వసతి గదులు, ఇతరత్రా భవన నిర్మాణాలు ప్రాజెక్టులో భాగం. గర్భాలయం ఎత్తు 64 అడుగులు. మహా మండపం 44 స్తంభాలతో నిర్మాణమవనుంది. కాకతీయ ఆలయ నిర్మాణ మూల శైలిని ప్రత



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

జిల్లా ఎస్పీ మహేష్ బి గీతె

ప్రజానావ, వేములవాడ: తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా అగ్రహారంలోని జేఎన్‌టీయూహెచ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే హాజరై విద్యార్థులతో కలిసి అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత సైబర్ నేరాల నుంచి రక్షణ అని సూచించారు. నకిలీ అకౌంట్లు, ఫేక్ లింకులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, లోన్ యాప్స్, డిజిటల్ అరెస్ట్, గిఫ్ట్, లాటరీ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే, ముఖ్యంగా గోల్డెన్ అవర్‌లో 1930కు కాల్ చేయాలని సూచించారు. విద్యార్థులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ డ్రగ్స్, గంజాయి వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ వీరప్రసాద్, సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ జునైద్, కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ రికార్డులపై సమగ్ర సర్వే నిర్వహించాలి

- కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై సీఎం స్పష్టత ఇవ్వాలి
- ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలి
- సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి డిమాండ్

ప్రజానావ, సిరిసిల్ల : ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టని, ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్లలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా భూ రికార్డుల్లో అవకత వకలు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో సర్వే నంబర్ల వారీగా సమగ్ర భూ సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామసభల ద్వారా భూముల హద్దులను గుర్తించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సంబంధించిన 425 ఎకరాల భూముల వివరాలపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముస్తాబాద్ మండలంలో భూ సమస్యపై వచ్చిన వినతిని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, బాధితుడికి న్యాయం జరగకపోతే సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

మోదీ ప్రభుత్వం కనుసన్నల్లోనే ఎన్నికల కమిషన్

ఎన్నికల కమిషన్ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కనుసన్నల్లో పనిచేస్తోందని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించడం ప్రజాస్వామ్యంపై ప్రభావం చూపిందని, ఓటర్ల నమోదు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు పంతం రవి, గుంటి వేణు, కడారి రాములు, మంద అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లిలో భారీ కొండచిలువ కలకలం

- పొలంలో ప్రత్యక్షమైన సుమారు 9 అడుగుల కొండచిలువ
- చాకచక్యంగా బంధించిన స్థానికుడు



ప్రజానావ, నల్లబెల్లి: మండల కేంద్రం సమీపంలోని వ్యవసాయ పొలంలో సుమారు 9 అడుగుల పొడవైన భారీ కొండచిలువ ప్రత్యక్షమై కలకలం రేపింది. పెద్ది కృష్ణారెడ్డి అనే రైతు పొలంలో కొండచిలువ కనిపించడంతో రైతులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న నల్లబెల్లికి చెందిన పిట్టల రమేష్ చాకచక్యంగా కొండచిలువను బంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎస్సై ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో కొండచిలువను అటవీశాఖ అధికారి కిరణ్‌కు అప్పగించారు. భారీ కొండచిలువను ఎలాంటి ప్రమాదం లేకుండా పట్టుకున్న రమేష్‌ను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది కిరణ్, నాగరాజుతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో మోదీకి 25 ఏళ్ల ప్రస్థానం

ప్రధాని నరేంద్ర మోదీకి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు



ప్రజానావ, హైదరాబాద్: ప్రజాసేవలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గవర్నర్ బుధవారం తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల్లో శుభాకాంక్షలు తెలియజేశారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోదీ.. అక్కడి నుంచి దేశ ప్రధానిగా ఎదిగి 25 ఏళ్లుగా ప్రజాసేవలో కొనసాగుతున్నారని గవర్నర్ పేర్కొన్నారు. ప్రజాసేవ పట్ల ప్రధాని మోదీ చూపుతున్న నిబద్ధత, సంకల్పం ప్రశంసనీయమని అన్నారు. దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. ప్రజాసేవలో 25 ఏళ్ల ప్రస్థానం ఒక కీలక మైలురాయి అని పేర్కొన్న గవర్నర్.. ప్రధాని మోదీకి సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని, దేశ ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, సామర్థ్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.







వికసిత్ భారత్ నిర్మాణ శిల్పులు విద్యార్థులే

- డిగ్రీతో పాటు నైపుణ్యాలు, సేవాభావాన్ని పెంపొందించుకోవాలి
- బీఆర్‌ఏఓయూ స్నాతకోత్సవంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

ప్రజానావ, హైదరాబాద్: డిగ్రీ పొందడం విద్యాభ్యాసానికి ముగింపు కాదని, బాధ్యతాయుతమైన కొత్త జీవితానికి నాంది అని తెలంగాణ గవర్నర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఛాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. జ్ఞానం, నైపుణ్యాలు, క్రమశిక్షణ, సేవాభావంతో దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ భవనం వెంకట్రామ్ ఆడిటోరియంలో 27వ స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. 45 ఏళ్ల ప్రస్థానంలో బీఆర్‌ఏఓయూ 25 లక్షల మందికిపైగా విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలు, వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్యను చేరువ చేయడంలో ఓపెన్ యూనివర్సిటీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మారుతున్న సాంకేతిక ప్రపంచంలో డిగ్రీ ఒక్కటే సరిపోదని, విద్యార్థులు జీవితాంతం నైపుణ్యాభివృద్ధి, పునర్నైపుణ్యాభివృద్ధి, అదనపు నైపుణ్యాలను కొనసాగించాలని సూచించారు. కేవలం ఉద్యోగార్థులను తయారు చేయడం కాకుండా ఆవిష్కర్తలు, సమస్య పరిష్కారకులు, పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడమే విద్యాసంస్థల లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు. హైదరాబాద్ ఐటీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, స్టార్టప్ రంగాల్లో ప్రముఖ ఆవిష్కరణ కేంద్రంగా ఎదుగుతోందని తెలిపారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చెడు సహవాసం, క్షణిక ఆకర్షణలు యువత జీవితాలను తప్పుదారి పట్టించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచే ప్రయత్నం ప్రారంభించాలని సూచించారు. విద్యార్థులు సాధించిన విజయాలను సమాజం, రాష్ట్రం, దేశ అభివృద్ధికి వినియోగించాలని కోరారు. జ్ఞానం, నైపుణ్యం, క్రమశిక్షణ, సేవాభావంతో కూడిన యువతే వికసిత్ భారత్–2047కు బలమని అన్నారు. యువత ఆలోచనలు, నాయకత్వం, సానుకూల దృక్పథం దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. 27వ స్నాతకోత్సవంలో వివిధ కోర్సుల్లో 36,145 మంది విద్యార్థులకు డిగ్రీలు, పీజీ డిగ్రీలు, డిప్లొమాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. 38 మంది విద్యార్థులకు స్వర్ణ పతకాలు, 23 మంది పరిశోధకులకు పీహెచ్‌డీ డిగ్రీలు, ఒకరికి ఎంఫిల్ డిగ్రీ అందజేశారు. అందరికీ విద్యను అందించాలన్న విశ్వవిద్యాలయ లక్ష్యంలో భాగంగా 27 మంది ఖైదీలు కూడా డిగ్రీలు అందుకున్నారు. వీరిలో 26 మంది పురుషులు, ఒక మహిళ ఉన్నారు. చెర్లపల్లి, రాజమహేంద్రవరం, కడప కేంద్ర కారాగారాల నుంచి వారు విద్యను పూర్తి చేశారు. సినీ రంగంతో పాటు సమాజానికి చేసిన విశేష సేవలను గుర్తిస్తూ ప్రముఖ దర్శకుడు, రచయిత, నటుడు బి. నర్సింగ్‌రావుకు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. పట్టాలు, స్వర్ణ పతకాలు అందుకున్న విద్యార్థులు, పరిశోధకులు, వారి కుటుంబ సభ్యులకు గవర్నర్ అభినందనలు తెలిపారు. విద్య, పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో బీఆర్‌ఏఓయూ మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, మాజీ నాక్ డైరెక్టర్, మాజీ బీఆర్‌ఏఓయూ ఉపకులపతి ప్రొఫెసర్ వి.ఎస్. ప్రసాద్, గౌరవ డాక్టరేట్ గ్రహీత బి. నర్సింగ్‌రావు, ప్రభుత్వ అధికారులు, ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు, తెలంగాణలోని వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, విశ్వవిద్యాలయ అధికారులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రవల్లిలో అమరవీరుల కాలనీ నిర్మాణం అభినందనీయం

- సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు
- గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద క్షీరాభిషేకం

ప్రజానావ, హైదరాబాద్: సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి గ్రామ పరిధిలో అక్రమాలకు గురైన 45 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, తెలంగాణ అమరవీరుల కుటుంబాల కోసం ప్రత్యేకంగా 'తెలంగాణ అమరవీరుల కాలనీ' నిర్మించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ, వివిధ ఉద్యమ సంఘాలు, తెలంగాణ జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు మోతె శోభన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్‌తో పాటు పలువురు ఉద్యమకారులు, కమిటీ సభ్యులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలను గౌరవించడం, నిజమైన ఉద్యమకారులకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. గత పాలకుల హయాంలో అక్రమాలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి, పక్కాగా సర్వే నిర్వహించి అర్హులకు అందించే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో భూమిని గుర్తించి, వచ్చే జూన్ 2 నాటికి అవసరమైన మౌలిక సదుపాయాలతో అమరవీరుల కాలనీని అభివృద్ధి చేయాలనే నిర్ణయం ఉద్యమకారుల సంక్షేమంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అమరవీరుల కుటుంబాలు, నిజమైన తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం సీఎం ఆలోచనలో ఉందనడానికి ఈ నిర్ణయం స్పష్టమైన ఉదాహరణ అని తెలిపారు. నకిలీ ఉద్యమకారులకు ఎలాంటి అవకాశం లేకుండా అర్హులను గుర్తించే ప్రక్రియలో ప్రభుత్వానికి కమిటీ సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. మోతె శోభన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు, జేఏసీ ప్రతినిధులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త బాధ్యతల్లో బీజేపీ నేతలు సమర్థంగా రాణించాలి

- ఫిలింనగర్ డివిజన్ నేతలకు చింతల రామచంద్రారెడ్డి శుభాకాంక్షలు
- పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సూచన



ప్రజానావ, హైదరాబాద్: ఫిలింనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ నేతలు నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఖైరతాబాద్ మాజీ శాసనసభ్యులు, బీజేపీ నేత చింతల రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కిసాన్ మోర్చా మీడియా సెల్‌కో–కన్వీనర్‌గా వుట్ల శశిశేఖర్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పండుల ఉపేంద్ర, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడిగా కుంభాల ప్రభాకర్ నియమితులైన నేపథ్యంలో వారు చింతల రామచంద్రారెడ్డిని కలిసి ఆశీస్సులు, శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ సందర్భంగా చింతల రామచంద్రారెడ్డి నూతన బాధ్యతలు చేపట్టిన వుట్ల శశిశేఖర్, పండుల ఉపేంద్ర, కుంభాల ప్రభాకర్‌లకు శుభాకాంక్షలు తెలియజేసి, తమకు అప్పగించిన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, వీధి వ్యాపారుల వర్గాల సంక్షేమం, హక్కులు, సాధికారత కోసం కృషి చేయాలని సూచించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ ఎస్సీ, ఎస్టీ మోర్చాలు, కిసాన్ మోర్చాలు చురుకైన పాత్ర పోషించేలా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకట్‌స్వామి, బీజేపీ సీనియర్ నాయకులు కాడి భోజిరెడ్డి, ఫిలింనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షురాలు దీపికా రాథోడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి దొంగరి రాజకళ, డివిజన్ కార్యదర్శి బొట్టు కళ్యాణి, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు జి.రమ్య, మారెమ్మ, పద్మ, పారిజాతం, లక్ష్మక్క తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సామా రామోహన్‌రెడ్డికి దానం నాగేందర్ అభినందనలు



ప్రజానావ, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేట్ అయిన సామా రామోహన్‌రెడ్డిని మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు దానం నాగేందర్, కాటూరి రమేష్, నరికేల్ల నరేష్ కలిసి అభినందించారు. ఈ సందర్భంగా సామా రామోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసి, ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేట్ అయినందుకు అభినందనలు తెలిపారు. అనంతరం గ్రాడ్యుయేట్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రాడ్యుయేట్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అభిప్రాయాలు, స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులతో సమన్వయం, ఎన్నికల కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్లు తమ సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అంశాలపైనా చర్చ జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రాడ్యుయేట్లు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రక్షణ సేనలోకి బీజేపీ నేత ఎల్లయ్య

ప్రజానావ, హైదరాబాద్: నిర్మల్ జిల్లా బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు సుంచు ఎల్లయ్యతో పాటు ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచులు టేకం లక్ష్మణ్, గడ్డం భీముడు, కె. రాజేందర్, కస్తూరి అర్జున్, శ్రీపెల్లి శేఖర్, ఉప సర్పంచులు పి. రాజు, చింటు కాంతి, గంపల భూమన్న, మాజీ ఎంపీటీసీ సభ్యులు రామ్‌సింగ్, షిండే సదాశివ, మాజీ సర్పంచులు ఎ. శంకర్, నాయకపోడ్, కోలం సంఘాల ప్రముఖులు, నాయకులు తెలంగాణ రక్షణ సేనలో చేరారు.





గ్రామీణ కళాకారుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కాలి

- చేనేత, హస్తకళలకు మెరుగైన మార్కెట్ కల్పించాలి
- స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలి
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

ప్రజానావ, హైదరాబాద్: గ్రామీణ కళాకారులు, చేనేత కార్మికుల ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ కల్పించి, వారి శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో చేనేత, హస్తకళలు కీలక పాత్ర పోషిస్తున్నా యని పేర్కొన్నారు. యెల్లారెడ్డిగూడలోని కమ్మ సంఘం హాల్‌లో నాబార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రామీణ భారత్ మహోత్సవ్–తెలంగాణ 2026' చేనేత, హస్తకళల ప్రదర్శన–చిక్రయ కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించి వివిధ స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 64 లక్షలకు పైగా కళాకారులు, చేనేత కార్మికులు ఈ రంగంపై ఆధారపడి ఉన్నారని, వారిలో 65 నుంచి 70 శాతం మహిళలు ఉండటం విశేషమన్నారు. వస్త్ర ఉత్పత్తిలో చేనేత రంగానికి 15 శాతం వాటా ఉందని, రూ.33 వేల కోట్లకు పైగా హస్తకళల ఎగుమతులు జరుగుతున్నాయని తెలిపారు. ఒక చీర తయారీకి నెలల తరబడి శ్రమించే కళాకారుడికి ఉత్పత్తి ధరలో తగిన వాటా దక్కాలని, మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా మార్కెట్ అవకాశాలు కల్పించాలని సూచించారు. నాణ్యత, ఆధునిక డిజైన్లు, మార్కెటింగ్‌ను మెరుగుపర్చడం ద్వారా చేనేత, హస్తకళలకు మరింత ఆదరణ తీసుకురావచ్చన్నారు. స్థానికంగా, చేతితో తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వినియోగదారులు కళాకారులకు అండగా నిలవాలని కోరారు. పోచంపల్లి ఇకత్, గద్వాల్, నారాయణపేట, గొల్లభామ చీరలు, నిర్మల్ కళ, పెంబర్తి లోహ కళ, చేర్యాల చిత్రకళ, ఆదిలాబాద్ డోక్రా వంటి తెలంగాణ సంప్రదాయ కళలు ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 59 వేల మందికిపైగా చేనేత కార్మికులు, కళాకారులు ఈ కళా వారసత్వాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు ఉత్పత్తి, మార్కెటింగ్, ఆదాయ అవకాశాలు పెరుగుతున్నాయని, గ్రామీణ మహిళలను చిన్నతరహా వ్యాపారాలతో అనుసంధానించడం ద్వారా ఆర్థిక స్వావలంబన పెరుగుతుందని గవర్నర్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కళాకారుల బృందాలు, స్వయం సహాయక సంఘాలను మార్కెట్‌తో అనుసంధానించేందుకు నాబార్డ్ చేస్తున్న కృషిని అభినందించారు. మహోత్సవంలో 35 భౌగోళిక గుర్తింపు (జీఐ) ఉత్పత్తులను ప్రదర్శించడం అభినందనీయ మన్నారు. తెలంగాణకు చెందిన మరికొన్ని ఉత్పత్తులకు జీఐ గుర్తింపు కోసం జరుగుతున్న ప్రయత్నాలు గ్రామీణ ఆదాయాన్ని పెంచేందుకు దోహదపడతాయని చెప్పారు. గ్రామీణ కళాకారులు అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములైన పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాకారమవుతుందని, ప్రజలు స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాబార్డ్ తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ బి. ఉదయ భాస్కర్, తెలంగాణ జనరల్ మేనేజర్ పి. రామలక్ష్మి , నాబార్డ్ ప్రతినిధులు, కళాకారులు, చేనేత కార్మికులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, గ్రామీణ వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

రోగులకు బాసటగా పద్మారావు గౌడ్

ప్రజానావ, సికింద్రాబాద్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు మహిళలకు సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగల పద్మారావు గౌడ్ అండగా నిలిచారు. నార్త్ లాలాగూడకు చెందిన మజర్ ఫాతిమా, వినోభానగర్‌కు చెందిన బీబీ రేహానా బేగం కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య చికిత్సకు ఆర్థిక సాయం కోసం సీతాఫలమండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పద్మారావు గౌడ్‌ను ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించి వారికి వైద్య చికిత్స కోసం ఎల్ఓసీలను మంజూరు చేయించారు. అనంతరం సీతాఫలమండీలోని తన కార్యాలయంలో బాధితులకు మంజూరు పత్రాలను అందజేశారు. మజర్ ఫాతిమాకు రూ.1.25 లక్షలు, బీబీ రేహానా బేగంకు రూ.2 లక్షల విలువైన ఎల్ఓసీ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ పేదల వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తుందని, ప్రజలు తమ అవసరాల కోసం సీతాఫలమండీలోని తన కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్నలక్ష్మి, రాసూరి సునీత, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కనెక్షన్‌కు కాసుల కటకట

- కొత్త మీటరుకు ముడుపుల ఆరోపణలు
- రూ.12 వేలు తీసుకుని ఏఐతో నకిలీ రసీదు సృష్టించిన లైన్‌మెన్
- నాగులవంచ పరిధిలో మరో ఐదుగురు రైతులకూ ఇదే అనుభవమంటూ సమాచారం



ఫిరోజాబాద్: భార్య తన ప్రియుడితో కలిసి ఉన్న విషయం తెలుసుకున్న భర్త ఆగ్రహంతో వారిద్దరిపై తుపాకీతో కాల్పులు జరిపిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో తీవ్ర కలకలం రేపింది. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన భార్య షిప్రా, సన్నీ అలియాస్ శివ ఠాకూర్‌ను పోలీసులు జిల్లా ఆస్పత్రిలోని ట్రామా సెంటర్‌కు తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఆగ్రా మెడికల్ కాలేజీకి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి షిప్రా భర్త రిషబ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, అతడి లైసెన్స్ రివాల్వర్, తూటాలతో పాటు ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. రిషబ్, షిప్రాలకు సుమారు పదేళ్ల క్రితం వివాహం కాగా, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటర్నెట్ కేఫ్ నిర్వహించే సన్నీతో తన భార్యకు వివాహేతర సంబంధం ఉందని రిషబ్ కొంతకాలంగా అనుమానిస్తున్నాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో భార్య షిప్రా సన్నీకి చెందిన ఇంటర్నెట్ కేఫ్‌లో అతడితో కలిసి ఉన్నట్లు రిషబ్‌కు తెలియడంతో కుమారుడితో కలిసి అక్కడికి చేరుకున్నాడు. అప్పటికే ఆగ్రహంతో ఉన్న రిషబ్ తన వద్ద ఉన్న లైసెన్స్ రివాల్వర్‌ను బయటకు తీసి వారిద్దరిపై వరుసగా ఆరు రౌండ్లు కాల్పులు జరిపాడు. తొలుత సన్నీపై రెండు రౌండ్లు, అనంతరం షిప్రాపై నాలుగు రౌండ్లు కాల్పులు జరిపాడు. రద్దీగా ఉండే ప్రాంతంలో కాల్పులు జరగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. పలువురు దుకాణదారులు తమ షాపులను మూసివేసి అక్కడి నుంచి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని రిషబ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు సన్నీతో తనకు ఎలాంటి సంబంధం లేదని షిప్రా భర్త ఆరోపణలను ఖండించింది. తనను హత్య చేయాలన్న ఉద్దేశంతోనే భర్త కాల్పులు జరిపాడని ఆమె ఆరోపించింది. కాల్పుల సమయంలో దంపతుల కుమారుడు అక్కడే ఉండగా, జరిగిన ఘటనను తన మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసినట్లు తెలుస్తోంది. తండ్రిని కాల్పులు ఆపాలని 'నాన్నా వద్దు' అంటూ కుమారుడు వేడుకున్న దృశ్యాలు కూడా వీడియోలో వినిపించాయి. కాల్పులకు సంబంధించిన వీడియో క్లిప్‌లు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

న్యూట్రినో రహస్యాల ఛేదనకు నోబెల్ గౌరవం

- **విశ్వ పరిణామంపై కీలక ఆధారాల అన్వేషణ**
- **ఐస్‌క్యూబ్ అబ్జర్వేటరీ ఏర్పాటులో ఫ్రాన్సిస్ హాల్జెస్ కీలక పాత్ర**



స్టాక్‌హోమ్ : విశ్వం ఎలా రూపాంతరం చెందిందనే విషయంపై కీలక ఆధారాలను అందించే అరుదైన న్యూట్రినో కణాల రహస్యాలను ఛేదించేందుకు చేసిన కృషికి బెల్జియం శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెస్‌కు భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. న్యూట్రినోలు విద్యుత్ ఆవేశం లేని, అత్యంత స్వల్ప ద్రవ్యరాశి కలిగిన సూక్ష్మ కాస్మిక్ కణాలు కావడంతో వాటిని గుర్తించడం అత్యంత కష్టం. విశ్వమంతటా విస్తరించి ఉన్న న్యూట్రినోలు సూర్యుడి వంటి నక్షత్రాల నుంచి వెలువడుతుంటాయి. ప్రతి సెకనుకు ట్రిలియన్ల సంఖ్యలో న్యూట్రినోలు మన శరీరాల గుండా కూడా ప్రయాణిస్తుంటాయి. ఈ రహస్యమైన 'భూత కణాలు' నేరుగా కనిపించవు. అవి ఇతర పదార్థ కణాలను ఢీకొన్నప్పుడు ఏర్పడే పరిణామాలను పరిశీలించడం ద్వారా శాస్త్రవేత్తలు వాటి ఉనికిని గుర్తిస్తారు. న్యూట్రినోలు ఇతర కణాలను అత్యంత అరుదుగా ఢీకొంటాయి. దీంతో వాటి పరస్పర చర్యలను గుర్తించే అవకాశాలను పెంచేందుకు శాస్త్రవేత్తలు భారీ డిటెక్టర్లను నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో అంటార్కిటికాలోని విస్తారమైన మంచును భారీ డిటెక్టర్‌గా ఉపయోగించాలనే ఆలోచనను హాల్జెస్ ప్రతిపాదించారు.

ఐస్‌క్యూబ్ అబ్జర్వేటరీలో కీలక పాత్ర

అంటార్కిటికాలో ఏర్పాటు చేసిన ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ నిర్మాణంలో హాల్జెస్ కీలకంగా వ్యవహరించారని నోబెల్ కమిటీ తెలిపింది. సుదూర గెలాక్సీల నుంచి వచ్చిన అత్యంత అధిక శక్తి కలిగిన న్యూట్రినోలను ఈ పరిశీలనా కేంద్రం తొలిసారిగా గుర్తించింది. 'అంటార్కిటికాలో నిర్వహిస్తున్న ఈ ప్రయోగం ఇంతకుముందెన్నడూ లేని విధంగా విశ్వాన్ని అర్థం చేసుకునేందుకు విప్లవాత్మక మార్గాన్ని అందించింది' అని అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ మైఖేల్ మెలోనీ అన్నారు. డిటెక్టర్‌లోని మంచుతో న్యూట్రినో పరస్పర చర్య జరిపినప్పుడు ఏర్పడే స్వల్ప కాంతి మెరుపులను సెన్సర్లు గుర్తిస్తాయి. పారదర్శకమైన మంచు కారణంగా ఈ అత్యంత సూక్ష్మమైన కాంతి సంకేతాలను శాస్త్రవేత్తలు గుర్తించగలుగుతున్నారు. కాస్మిక్ కిరణాలు, రేడియేషన్ వంటి ఇతర అంతరాయాలను తగ్గించేందుకు సెన్సార్లను సుమారు 8,200 అడుగుల లోతులో మంచులో అమర్చారు. 82 ఏళ్ల హాల్జెస్ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్–మ్యాడిసన్‌తో అనుబంధం కలిగి ఉన్నారు. ఐస్‌క్యూబ్ పరిశీలనా కేంద్రాన్ని ఈ విశ్వవిద్యాలయమే నిర్వహిస్తోంది. విశ్వం పరిణామానికి సంబంధించిన కీలక ఆధారాలను అందించే అరుదైన న్యూట్రినోలపై పరిశోధనలో హాల్జెస్ కీలక పాత్ర పోషించారు.

వైద్యుల సోషల్ మీడియాపై నిబంధనలు

న్యూఢిల్లీ: రోగులను ఆకట్టుకునేందుకు వైద్యులు, దవాఖానలు సోషల్ మీడియాను ఇష్టానుసారంగా వినియోగించడంపై జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. వైద్యులు, దవాఖానలు, వైద్య సంస్థలు, నమోదిత వైద్య నిపుణులు పాటించాల్సిన నైతిక ప్రకటనలు, ప్రజా సమాచార ప్రసారంపై ఎన్‌ఎంసీ జారీ చేసిన కొత్త మార్గదర్శకాలు తక్షణమే అమల్లోకి వచ్చాయి. కొత్త నిబంధనల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్, ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్, స్పాన్సర్డ్ పోస్టులు, కృత్రిమ మేధస్సు (ఏఐ)తో రూపొందించిన ప్రచారాలను కూడా వైద్య ప్రకటనల పరిధిలోకి తీసుకొచ్చారు. వైద్య సేవలను వాణిజ్యపరంగా ప్రచారం చేయడం, రోగుల అభిప్రాయాలను ఉపయోగించడం, డబ్బులు చెల్లించి రాయించిన లేదా నకిలీ సమీక్షలను ప్రచురించడం, తప్పుదోవ పట్టించే వాదనలు చేయ డం, చికిత్స ద్వారా కచ్చితమైన ఫలితాలు వస్తాయని హామీ ఇవ్వ డంపై వైద్యులకు ఆంక్షలు విధించారు. అలాగే రోగుల కథనా లను ఉపయోగించి తమ సేవలను ప్రచారం చేసుకోవడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఆరోగ్య అవగాహన కల్పిం చడంతో పాటు వ్యక్తిగత బ్రాండ్‌ను నిర్మించుకోవడం, కొత్త రోగు లను ఆకర్షించడం కోసం వైద్యులు ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ సహా వివిధ సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగిస్తున్న నేపథ్యంలో ఎన్‌ఎంసీ ఈ నిబంధన లను తీసుకొచ్చింది. ప్రజారోగ్య సమాచారానికి, వాణిజ్య ప్రచారా నికి మధ్య స్పష్టమై న గీతను గీసిన ఎన్‌ఎంసీ.. తమ చికిత్స, వైద్య సదుపాయాలు లేదా నైపుణ్యం ఇతరుల కంటే మెరుగైనవని వైద్యులు ప్రచారం చేసుకోరాదని పేర్కొంది.

సుప్రీంకోర్టులో కీలక పరిణామం

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకానికి సంబం ధించిన 2023 చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విస్తృత ధర్మాసనానికి నివేదించాలా వద్దా అనే అంశంపై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ అంశంపై సెప్టెంబర్ 23న వెలువడిన భిన్న తీర్పును ఉపసంహరించుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసింది. ఈ కేసును విస్తృత ధర్మాసనానికి నివేదించా ల్సిన అవసరం లేదని జస్టిస్ దీపాంకర్ దత్తా అభిప్రాయపడగా, ఐదుగురు న్యాయమూ ర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశాన్ని పరిశీలిం చాలని జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ అభిప్రా యపడ్డారు. ఇద్దరు న్యాయమూర్తులు భిన్న అభిప్రా యాలు వ్యక్తం చేయడంతో ఈ వ్యవహారంపై స్పష్టత కోసం తదుపరి న్యాయపరమైన చర్యలు అవసరమ య్యా యి. ఈ నేపథ్యంలో భిన్న తీర్పును ఉపసంహ రించుకోవాలని కోరుతూ దాఖలైన రీకాల్ పిటిషన్ బుధవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఎదుట ప్రస్తావనకు వచ్చింది. పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే ముందు న్యాయస్థానం దానిని పరిశీలిస్తుందని సీజేఐ సూర్యకాంత్ తెలిపారు.

సీఈసీ రాజీనామాకు డిమాండ్

- **10న జంతర్ మంతర్ వద్ద ధర్నా**
- **దేశవ్యాప్తంగా పౌరులు తరలిరావాలని పిలుపు**
- **ప్రభుత్వ విధానాలు మార్చుకోవాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్**

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. ఈ నెల 10న నిర్వహించనున్న ఈ ఆందోళనకు దేశవ్యాప్తంగా పౌరులు తరలిరావాలని ఆ పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ పిలుపునిచ్చారు. ఎన్నికలు, ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలపై యువతలో తీవ్ర ఆందోళన ఉందని, అందుకే ఈ నిరసనకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు. ఇదే సమయంలో బీజేపీ కార్యకర్తలు ఢిల్లీకి చేరుకుని రాళ్లు రువ్వడం, లాఠీల ప్రయోగం వంటి చర్యలకు పాల్పడేలా ఆ పార్టీని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని సౌరవ్ దాస్ ఆరోపించారు. ప్రభుత్వ చర్యలు దేశంలో అంతర్యుద్ధ పరిస్థితులకు దారితీయాలని కోరుకుంటున్నారా? అని ప్రశ్నించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీ నామా చేయడంతో పాటు ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలనే డిమాండ్లతో తమ ఆందోళన కొనసాగుతుందని పార్టీ నేతలు తెలిపారు.





గడ్చిరోలి అడవుల్లో భారీగా మావోయిస్టుల ఆయుధాల స్వాధీనం

రైఫిళ్లు, పిస్టళ్లతో పాటు బీజీఎల్ లాంచర్, పేలుడు సామాగ్రి పట్టివేత

ప్రజానావ, ముంబై: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టులు పాతిపెట్టిన భారీ ఆయుధాల నిల్వను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కోపర్షి అటవీ ప్రాంతంలో అక్టోబర్ 6న నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఈ ఆయుధాలు, పేలుడు సామగ్రి బయటపడింది. మావోయిస్టుల నక్సల్ వారోత్సవాలు, ఎన్నికలు, భద్రతా దళాలపై దాడుల సమయంలో వినియోగించేందుకు ఆయుధాలను రహస్యంగా పాతిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్పీ ఎం. రమేష్ మార్గదర్శకత్వంలో స్పెషల్ ఆపరేషన్స్ టీమ్, బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్ (BDDS) సంయుక్తంగా గాలింపు చేపట్టాయి. ఈ తనిఖీల్లో ఒక 303 రైఫిల్, రెండు సింగిల్‌షాట్ రైఫిళ్లు, రెండు నాటు తుపాకులు, ఒక బీజీఎల్ లాంచర్, 10 బీజీఎల్ సెల్స్, 21 లైవ్ కాట్రిడ్జ్‌లు, ఏడు డిటోనేటర్లు, 150 మీటర్ల కేబుల్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు రెండు మ్యాగజైన్లు, రెండు కుక్కర్లు, మూడు వాకీటాకీలు, మూడు ఛార్జర్లు, రెండు వాకీటాకీ బ్యాటరీలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అదనపు ఎస్పీలు కార్తీక్ మధీర, గోకుల్ రాజ్ జి., హర్ష వర్ధన్ బి.జె., డీఎస్పీ సునీల్ ఉయికేల పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ కొనసాగింది. అడవుల్లో మావోయిస్టుల కదలికలు, ఆయుధాల నిల్వలపై భద్రతా బలగాలు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నాయి.

బెంగళూరులో విద్యుత్ ఆర్ఎంయూ పేలుడు

- **ఫుట్‌పాత్‌పై వెళ్తున్న వ్యక్తికి గాయాలు**

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో విద్యుత్ రింగ్ మెయిన్ యూనిట్ (ఆర్ఎంయూ) పేలిపోవడంతో తీవ్ర కలకలం రేగింది. బాగలూరు క్రాస్ వద్ద అమెజాన్ కార్యాలయం సమీపంలో ఉదయం 9.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళ్తున్న మహమ్మద్ అఫ్రోజ్ సమీపంలో ఉన్న విద్యుత్ రింగ్ మెయిన్ యూనిట్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. పేలుడు ధాటికి అఫ్రోజ్ కిందపడి పోగా, వెంటనే స్పందించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం తప్పిందని అధికారులు తెలిపారు. ఘటనతో స్థానికులు భయాందోళనలకు గురై పరు గులు తీశారు. యలహంక ఓల్డ్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనపై బెంగళూరు విద్యుత్ సరఫరా కంపెనీ అధికారులు స్పందిస్తూ.. మీడియం వోల్టేజ్ విద్యుత్ పంపిణీ నెట్ వర్క్‌లో భాగమైన రింగ్ మెయిన్ యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తడం వల్లే పేలుడు సంభవించి నట్లు తెలిపారు. ఇలాంటి పేలుళ్లు చాలా అరుదుగా జరుగుతాయని పేర్కొన్నారు. సమాచారం అందుకు న్న వెంటనే తమ సాంకేతిక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్ యూనిట్ పేలడంతో ఆ ప్రాంతంలో కొంత సేపు గందరగోళ వాతావరణం నెలకొంది.

పదేళ్ల నాయకత్వం
అద్భుతం

- కలిసి మరిన్ని విజయాలు సాధిద్దాం
- హర్మన్ కెప్టెన్సీపై స్మృతి ప్రశంసలు



ముంబై: భారత మహిళల క్రికెట్ జట్టు కొత్త కెప్టెన్ స్మృతి మంధాన తన పూర్వ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌పై ప్రశంసలు కురిపించింది. హర్మన్ పదేళ్ల నాయకత్వం అద్భుతంగా సాగిందని పేర్కొంటూ.. ఆమెతో కలిసి మరికొంతకాలం దేశానికి మరిన్ని విజయాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపింది. హర్మన్‌ప్రీత్ మంగళవారం అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో దశాబ్దకాల నాయకత్వానికి తెరపడింది. ఆమె సారథ్యంలో భారత్ 2025లో తొలిసారి వన్డే ప్రపంచకప్ గెలవడంతోపాటు 2023, 2026 ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించింది. ఇక మంధాన పూర్తి స్థాయి కెప్టెన్‌గా ఈ నెలలో జింబాబ్వేతో జరిగే టీ20, వన్డే సిరీస్‌లతో కొత్త బాధ్యతలు చేపట్టనుంది. హర్మన్ నాయకత్వానికి జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, శ్రేయాంక పాటిల్, రేణుకా సింగ్ ఠాకూర్ కృతజ్ఞతలు తెలిపారు. హర్మన్ ఇచ్చిన మార్గదర్శనం, ప్రోత్సాహం మరువలేనివని పేర్కొన్నారు. కెప్టెన్సీ అధ్యాయం ముగిసినా నాయకురాలిగా ఆమె ప్రభావం ఎప్పటికీ కొనసాగుతుందని రిచా పేర్కొంది.

జట్టులో కొనసాగింపు

మాజీ భారత ఆల్‌రౌండర్ సురేశ్ రైనా కూడా హర్మన్ నాయకత్వాన్ని కొనియాడాడు. ధైర్యం, వ్యక్తిత్వంతో సాగిన అద్భుత ప్రయాణమని ప్రశంసించాడు. కాగా, హర్మన్‌ప్రీత్ భారత జట్టులో కొనసాగనుంది. జింబాబ్వే సిరీస్‌కు ఎంపిక చేసిన రెండు జట్లలోనూ ఆమెకు చోటు లభించింది.

భువీ బాటలో షమీ?

- 36ఏళ్ల పేసర్‌కు టీమిండియా తలుపులు తెరుచుకుంటాయా?
- దేశవాళీలో అదరగొడుతున్న బెంగాల్ స్టార్
- పునరాగమనంపై గంపెడాశలు

బెంగళూరు: నాలుగేళ్ల విరామం తర్వాత భారత టీ20 జట్టులోకి భువనేశ్వర్ కుమార్ పునరాగమనం చేయడంతో ఇప్పుడు మరో 36 ఏళ్ల పేసర్ మహ్మద్ షమీ పేరు తెరపైకి వచ్చింది. భువీ బాటలో షమీ కూడా టీమిండియాలోకి తిరిగి రాగలడా? అన్న చర్చ క్రికెట్ వర్గాల్లో మొదలైంది. అయితే ఇందుకు అతడి ఐపీఎల్ ప్రదర్శన కాస్త అడ్డంకిగా కనిపిస్తున్నా.. దేశవాళీ క్రికెట్‌లో షమీ చూపుతున్న ఫామ్ ఆశలు రేకెత్తిస్తోంది. 2025, 2026 ఐపీఎల్ సీజన్లలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరఫున 30 మ్యాచ్‌ల్లో 45 వికెట్లు తీసిన భువనేశ్వర్ జాతీయ జట్టులోకి తిరిగి వచ్చాడు. కొత్త బంతితో స్వింగ్ చేయడంతో పాటు డెత్ ఓవర్లలో యార్కర్లు, స్లో బంతులు, బౌన్సర్లతో అతడు రాణిస్తున్నాడు. ఈ రెండు సీజన్లలో పవర్‌ప్లేలో 25, చివరి ఐదు ఓవర్లలో 18 వికెట్లు పడగొట్టాడు. ఆర్‌సీబీ సహాయ కోచ్ ఓంకార్ సాల్వీ మాట్లాడుతూ.. తన బౌలింగ్‌పై భువనేశ్వర్‌కు స్పష్టత ఉండటం, పరిస్థితులకు తగ్గట్టు మారడం అతడి విజయానికి కారణమని చెప్పారు. యువ బౌలర్లకు మార్గనిర్దేశం చేయడంలోనూ భువీ కీలకంగా ఉన్నాడన్నారు. జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి నేపథ్యంలో న్యూజిలాండ్‌తో సిరీస్‌లోనూ



ఇదే పాత్రను భువనేశ్వర్ పోషించనున్నాడు.

ఐపీఎల్‌లో షమీ వెనుకంజ

షమీ గత రెండు ఐపీఎల్ సీజన్లలో 22 మ్యాచ్‌ల్లో 18 వికెట్లు మాత్రమే తీశాడు. అతడి ఎకానమీ రేటు కూడా 10గా ఉంది. అయినప్పటికీ దేశవాళీ క్రికెట్‌లో మాత్రం అతడి ప్రదర్శన ఆశాజనకంగా ఉంది. 2025–26 రంజీ సీజన్‌లో ఏడు మ్యాచ్‌ల్లో 37 వికెట్లు తీసి బెంగాల్ సెమీఫైనల్ చేరడంలో కీలకపాత్ర పోషించాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఏడు మ్యాచ్‌ల్లో 15, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఏడు మ్యాచ్‌ల్లో 16 వికెట్లు పడగొట్టాడు. 2026–27 సీజన్‌ను కూడా షమీ ఘనంగా ఆరంభించాడు. 14 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీ గెలిచిన ఈస్ట్ జోన్ తరఫున ఏడు వికెట్లు తీశాడు.

మళ్లీ భారత్‌కు ఆడాలి

దులీప్ ట్రోఫీ అనంతరం షమీ మాట్లాడుతూ.. ఈ స్థాయిలో స్వీయ ప్రేరణతో ముందుకు సాగాల్సిందేనని, తాను ఎప్పుడూ తదుపరి స్థాయిని లక్ష్యంగా పెట్టుకుంటానని చెప్పాడు. బెంగాల్ కోచ్ లక్ష్మీ రతన్ శుక్లా కూడా షమీ మళ్లీ భారత్‌కు ఆడాలని ఆకాంక్షించారు. ఈ సీజన్‌లో అతడు యువ బౌలర్‌లా బౌలింగ్ చేస్తున్నాడని, కెరీర్‌ను భారత్ తరఫునే ముగించే అవకాశం రావాలని కోరుకున్నారు. ఐపీఎల్‌లో వెనుకబడినా.. దేశవాళీలో నిలకడగా రాణిస్తున్న షమీ పట్టుదల చూస్తుంటే మరో పునరాగమన కథకు తెరలేచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అగార్కర్‌కు బీసీసీఐ ప్రశంసలు

- మూడేళ్ల సేవలకు అభినందనలు
- భవిష్యత్తు ప్రయాణానికి శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: భారత పురుషుల క్రికెట్ జట్టు మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ సేవలను బీసీసీఐ ప్రశంసించింది. మూడేళ్ల పదవీకాలంలో ఆయన చూపిన నిబద్ధత, పట్టుదల, కృషిని కొనియాడుతూ భవిష్యత్తు ప్రయాణానికి శుభాకాంక్షలు తెలిపింది. అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా ఉన్న సమయంలో భారత్ 2024, 2026 టీ20 ప్రపంచకప్‌లు, 2025 ఛాంపియన్స్ ట్రోఫీతో కలిపి మూడు ఐసీసీ టైటిళ్లు, రెండు ఆసియా కప్‌లు సాధించింది. వరుసగా రెండు ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు దక్కించుకుంది. 2023 వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్‌కు చేరింది. ఇదే కాలంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టీ20, టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో జట్టు కీలక మార్పుల దశను కూడా ఎదుర్కొంది. గత నెలతో అగార్కర్ పదవీకాలం ముగిసింది. చీఫ్ సెలెక్టర్ పదవి ఖాళీ కావడంతో బీసీసీఐ తాజాగా దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో అగార్కర్‌కు పదవీకాలం పొడిగిస్తారన్న ఊహాగానాలకు తెరపడింది. భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సైతం అగార్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 'టీమ్ ఫస్ట్' సిద్ధాంతంపై ఆయనకున్న నమ్మకం భారత జట్టు మూడు ఐసీసీ ట్రోఫీలు సాధించడంలో కీలకంగా నిలిచిందని గంభీర్ ప్రశంసించారు.

ర్యాంకింగ్స్‌లో శ్రేయస్ జోరు!

- కెరీర్‌లో తొలిసారి ఏడో స్థానానికి భారత టీ20 కెప్టెన్
- విండీస్‌పై సెంచరీతో 18 స్థానాలు ఎగబాకిన అయ్యర్
- బౌలర్లలో మళ్లీ అగ్రస్థానంలో రషీద్ ఖాన్



దుబాయ్: ఐసీసీ తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కెరీర్‌లోనే అత్యుత్తమంగా ఏడో స్థానానికి చేరాడు. వెస్టిండీస్‌తో లక్నోలో జరిగిన తొలి టీ20లో 43 బంతుల్లో అజేయంగా 102 పరుగులు చేయడం అతడికి భారీగా కలిసొచ్చింది. ఈ ప్రదర్శనతో ఏకంగా 18 స్థానాలు ఎగబాకిన అయ్యర్.. టీ20ల్లో భారత్ తరఫున మూడో అత్యుత్తమ ర్యాంక్ బ్యాటర్‌గా నిలిచాడు. భారత బ్యాటర్లలో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ వరుసగా తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. తిలక్ వర్మ పదో ర్యాంక్‌లో ఉన్నాడు. దీంతో టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్–10లో భారత్‌కు నలుగురు బ్యాటర్లు చోటు దక్కించుకున్నారు. యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఎనిమిది స్థానాలు మెరుగుపరుచుకుని 46వ ర్యాంక్‌కు చేరాడు. టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మరోసారి అగ్రస్థానాన్ని అందుకున్నాడు. భారత స్పిన్నర్ అక్షర్ పటేల్ కూడా భారీగా మెరుగుపడ్డాడు. ఈ వారం మూడు మ్యాచ్‌ల్లో రెండేసి వికెట్లు చొప్పున తీసిన అక్షర్.. 16 స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంక్‌కు చేరాడు.

గిల్ ఆధిపత్యం

వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో శుభ్‌మన్ గిల్ తన నంబర్‌వన్ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకున్నాడు. గువాహటిలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులు చేసిన గిల్.. 25 రేటింగ్ పాయింట్లు సాధించి కెరీర్‌లోనే అత్యధికంగా 841 పాయింట్లకు చేరుకున్నాడు. దీంతో అగ్రస్థానంలో అతడి ఆధిపత్యం మరింత పెరిగింది. విరాట్ కోహ్లీ రెండో స్థానం నుంచి మూడో స్థానానికి పడిపోయాడు. మూడో వన్డేలో శతకంతో మెరిసిన కేఎల్ రాహుల్ ఏడు స్థానాలు ఎగబాకి తిరిగి టాప్–10లోకి ప్రవేశించాడు. అతడు పదో ర్యాంక్‌లో నిలిచాడు.

డీసీ మిడిలార్డర్‌కు పంత్ పర్‌ఫెక్ట్

- అతడి నుంచి అత్యుత్తమ ఆట రాబడతాం
- ఢిల్లీ క్యాపిటల్స్ కోచ్ గంగూలీ

న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ కొత్త ప్రధాన కోచ్ సౌరవ్ గంగూలీ.. వికెట్‌కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్‌పై నమ్మకం వ్యక్తం చేశాడు. జట్టు మిడిలార్డర్‌కు పంత్ సరిగ్గా సరిపోతాడని, వచ్చే ఐపీఎల్ సీజన్‌లో అతడి నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టేందుకు ప్రయత్నిస్తామని చెప్పాడు. ఢిల్లీ తరఫున 111 మ్యాచ్‌లు ఆడిన పంత్ 3,284 పరుగులు చేయడంతోపాటు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. 2025లో లక్నో సూపర్ జెయింట్స్‌కు వెళ్లిన అతడు ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో కుల్దీప్ యాదవ్‌కు బదులుగా తిరిగి ఢిల్లీ జట్టులోకి వచ్చాడు. ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియంలో పంత్ బ్యాటింగ్‌ను ఆస్వాదిస్తాడని, రానున్న రోజుల్లో అతడి అత్యుత్తమ ఆటను చూడాలని ఆశిస్తున్నట్లు గంగూలీ పేర్కొన్నాడు. గత సీజన్‌లో ఢిల్లీ ఆరో స్థానంతో ముగిసింది. వచ్చే సీజన్‌లో జట్టును ప్లేఆఫ్స్‌కు చేర్చడమే తన ప్రధాన లక్ష్యమని గంగూలీ తెలిపాడు. కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్, పంత్, మిచెల్ స్టార్క్, లుంగి ఎంగిడి, డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్ వంటి ప్రతిభావంతులతో జట్టు బలంగా ఉందన్నాడు.



ఆటగాళ్లను అర్థం చేసుకోవాలి

కోచ్‌గా ఆటగాడిగా ఉండటానికి చాలా తేడా ఉందని గంగూలీ చెప్పాడు. ప్రతి ఆటగాడి అవసరాలు, సామర్థ్యాలను అర్థం చేసుకుని వారిలోని అత్యుత్తమ ప్రతిభను వెలికితీయడమే కోచ్ బాధ్యత అన్నాడు. 2019లో ఢిల్లీ ఫ్రాంచైజీతో తన అనుబంధం మొదలైందని, తిరిగి జట్టును



విజయపథంలో నడిపించేందుకు ఉత్సాహంగా ఉన్నానని పేర్కొన్నాడు. 2020లో ఢిల్లీ ఐపీఎల్ ఫైనల్‌కు చేరినప్పటికీ ఆ తర్వాత ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేక పోయిందని గంగూలీ గుర్తుచేశాడు. డ్రెస్సింగ్‌రూమ్‌లో అపార ప్రతిభ ఉందని, దానిని పూర్తిస్థాయిలో వినియోగించి ఢిల్లీని అగ్రస్థాయికి తీసుకెళ్లడమే తన లక్ష్యమని స్పష్టం చేశాడు.

భారత్ సొంత ఏఐ
మోడళ్లు నిర్మించాలి

- ఔత్సాహికులకు సొంత నిధులతో రూ.1–2 కోట్లు ఇస్తా
- పేటీఎం వ్యవస్థాపకుడు, సీఈఓ విజయ్ శేఖర్ శర్మ



న్యూఢిల్లీ: భారత్ సొంత కృత్రిమ మేధ (ఏఐ) మోడళ్లను అభివృద్ధి చేయాలని పేటీఎం వ్యవస్థాపకుడు, సీఈఓ విజయ్ శేఖర్ శర్మ పిలుపునిచ్చారు. బెంగళూరులో జరిగిన 'సైఫర్ 2026' సదస్సులో మాట్లాడుతూ.. ఈ దిశగా ముందుకొచ్చే ఔత్సాహికులకు తన సొంత నిధుల నుంచి రూ.1–2 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అవసరమైతే ఈ మొత్తాన్ని పెంచుతానన్నారు. భారత్ ప్రస్తుతం విదేశాల్లో అభివృద్ధి చేసిన ఏఐ మోడళ్లపై అప్లికేషన్లు రూపొందించడంలో ముందుందని, ఇక సొంత మోడళ్లను కూడా అభివృద్ధి చేయాల్సిన సమయం వచ్చిందని శర్మ అన్నారు. ఏఐ మోడల్ నిర్మాణానికి 100 మిలియన్ డాలర్లలోపే ఖర్చవుతుందని, నిధుల కంటే దీర్ఘకాలిక నిబద్ధతే ముఖ్యమన్నారు.

పేటీఎంలోనూ సొంత ఏఐ

లిస్టెడ్ సంస్థ కావడంతో పేటీఎం నిధులను ఇలాంటి పెట్టుబడులకు వినియోగించలేనని, అయితే సంస్థ పంపిణీ నెట్‌వర్క్‌ను కొత్త ఏఐ ఉత్పత్తులకు అందుబాటులో ఉంచుతానని చెప్పారు. పేటీఎం ఇప్పటికే రిస్క్, ఫ్రాడ్ వ్యవస్థల కోసం సొంత ఏఐను అభివృద్ధి చేస్తోందన్నారు. 200 బిలియన్ పారామీటర్ల మోడల్‌ను భారతీయ భాషల కోసం 4 బిలియన్ పారామీటర్లకు ఆప్టిమైజ్ చేసినట్లు తెలిపారు. ఏఐను భారత్ ఆర్థిక శక్తిగా మలచుకోవచ్చని, దేశంలో ఏఐ పర్యావరణ వ్యవస్థ లేదన్నది సరికాదని శర్మ పేర్కొన్నారు. ''మీరే ఆ వ్యవస్థ.. మీకు కావాల్సినవన్నీ మీలోనే ఉన్నాయి'' అని ఔత్సాహికులకు పిలుపునిచ్చారు.

సింగపూర్‌కు మరిన్ని విమానాలు

- ఎయిరిండియా–సింగపూర్ ఎయిర్‌లైన్స్ భాగస్వామ్యం విస్తరణ
- 8 నగరాల నుంచి వారానికి 126 సర్వీసులు

న్యూఢిల్లీ: భారత్–సింగపూర్ మధ్య ప్రయాణికులకు మరిన్ని విమాన ఎంపికలు కల్పించేందుకు ఎయిరిండియా, సింగపూర్ ఎయిర్‌లైన్స్ వాణిజ్య సహకారాన్ని విస్తరించాయి. ఈనెల 15 నుంచి ఇరు సంస్థల బుకింగ్ వ్యవస్థల ద్వారా ఒకదాని విమానాలను మరొకటి విడిగా బుక్ చేసుకునే అవకాశం కల్పించనున్నాయి. సింగపూర్–భారత్ మధ్య అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, కొచ్చి, కోల్‌కతా, ముంబై నగరాలను కలుపుతూ వారానికి 126 విమానాలు నడుస్తున్నాయి. లేఓవర్, వేచి ఉండే సమయాలను తగ్గించడంతో పాటు కార్పొరేట్ ప్రయాణికులకు మెరుగైన సేవలపై ఇరు సంస్థలు దృష్టి సారిస్తున్నాయి. ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా ఉంది. 2027 రెండో త్రైమాసికం నుంచి మహారాజా క్లబ్, క్రిస్‌ఫ్లయర్ సభ్యులకు అర్హత ఉన్న మార్గాల్లో పరస్పర అదనపు ప్రయోజనాలు లభించనున్నాయి.

డెరివేటివ్స్‌పై ఆర్‌బీఐ చెక్!

- రూ.25 వేల కోట్లకుపైగా బకాయిలున్న బ్యాంకులకు ప్రామాణిక విధానం తప్పనిసరి
- కౌంటర్‌పార్టీ క్రెడిట్ రిస్క్ అంచనాకు కొత్త నిబంధనలు

ముంబై: డెరివేటివ్స్ లావాదేవీల్లో కౌంటర్‌పార్టీ క్రెడిట్ రిస్క్‌ను అంచనా వేసేందుకు భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) కొత్త నిబంధనలు జారీ చేసింది. అంతర్జాతీయ కార్యకలాపాలు నిర్వహించే బ్యాంకులు లేదా సమష్టి ప్రాతిపదికన డెరివేటివ్స్ బకాయిల పుస్తక విలువ రూ.25,000 కోట్లు, అంతకంటే ఎక్కువగా ఉన్న బ్యాంకులు 'ప్రామాణిక విధానం'ను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేసింది. నిర్దేశిత పరిమితికి లోబడి ఉన్న ఇతర బ్యాంకులు కౌంటర్‌పార్టీ క్రెడిట్ రిస్క్‌ను అంచనా వేసేందుకు ప్రస్తుత ఎక్స్‌పోజర్ విధానం లేదా ప్రామాణిక విధానంలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవచ్చని ఆర్‌బీఐ తెలిపింది. జూన్ 10న విడుదల చేసిన ముసాయిదా మార్గదర్శకాలపై వచ్చిన సూచనలను పరిశీలించిన అనంతరం తుది నిబంధనల్లో మార్పులు చేసినట్లు పేర్కొంది. ఓవర్–ది–కౌంటర్ డెరివేటివ్స్, ఎక్స్ఛేంజ్



ట్రేడెడ్ డెరివేటివ్స్, సెక్యూరిటీస్ ఫైనాన్సింగ్ లావాదేవీలు, దీర్ఘకాల సెటిల్‌మెంట్ లావాదేవీల ద్వారా ఏర్పడే కౌంటర్‌పార్టీ క్రెడిట్ రిస్క్‌కు ఈ నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది. కనీస మూలధన అవసరాలకు సంబంధించిన 2025 నాటి మార్గదర్శకాలను కూడా తాజాగా సవరించింది.

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు మరో షాక్!

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్)ను షెడ్యూల్డ్ బ్యాంకుల జాబితా నుంచి రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) అధికారికంగా తొలగించింది. బ్యాంకింగ్ లైసెన్స్‌ను రద్దు చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ చట్టం–1934లోని రెండో షెడ్యూల్ నుంచి పీపీబీఎల్‌ను తొలగించినట్లు బుధవారం ప్రకటించింది. నిబంధనలను పాటించకపోవడంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో పీపీబీఎల్ బ్యాంకింగ్ లైసెన్స్‌ను ఆర్‌బీఐ రద్దు చేసింది. బ్యాంకు వ్యవహారాలు డిపాజిటర్ల ప్రయోజనాలకు విరుద్ధంగా సాగుతున్నాయని అప్పట్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

మార్కెట్ల జోరుకు బ్రేక్!

- ఆర్‌బీఐ వడ్డీరేటు పెంపుతో సెంటిమెంట్ దెబ్బ
- సెన్సెక్స్ 429 పాయింట్లు పతనం.. నిఫ్టీ 173 పాయింట్లు డౌన్



ముంబై: రెండు రోజుల వరుస లాభాలకు బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లు బ్రేక్ వేశాయి. ఆర్‌బీఐ దాదాపు నాలుగేళ్ల తర్వాత తొలిసారిగా రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచడం, ముడిచమురు ధరలు ఎగబాకడం, విదేశీ నిధుల ఉపసంహరణతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 429.11 పాయింట్లు (0.59 శాతం) నష్టపోయి 72,638.70 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 599.09 పాయింట్లు కోల్పోయి 72,468.72కు పడిపోయింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 173.05 పాయింట్లు (0.76 శాతం) తగ్గి 22,603.05 వద్ద స్థిరపడింది. ఆర్‌బీఐ నిర్ణయంతో ఒత్తిడి: రెపో రేటును 5.50 శాతానికి పెంచడంతో పాటు విధాన వైఖరిని 'తటస్థం' నుంచి 'క్రమబద్ధమైన కఠినతరం'గా మార్చడం మార్కెట్లను అప్రమత్తం చేసింది. సమీప కాలంలో వడ్డీరేట్ల కోతకు అవకాశం లేదని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేయడం కూడా ప్రతికూల ప్రభావం చూపింది. ఇక అంతర్జాతీయ ముడిచమురు ధర బ్యారెల్‌కు 102 డాలర్లకు చేరడంతో మార్కెట్లపై ఒత్తిడి పెరిగింది. మంగళవారం విదేశీ సంస్థాగత మదుపరులు రూ.2,961.30 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు. సెన్సెక్స్‌లో టైటన్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీపీ, అదానీ పోర్ట్స్ ప్రధానంగా నష్టపోయాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ లాభపడ్డాయి. రంగాల వారీగా మెటల్ 2.46 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 1.83 శాతం, రియల్టీ 1.74 శాతం, ఆటో 1.41 శాతం నష్టపోయాయి.

బంగారం ధరకు బ్రేక్

- రెండో రోజూ తగ్గిన పసిడి
- 10 గ్రాములకు రూ.1,48,900

న్యూఢిల్లీ: దేశీయ డిమాండ్ మందగించడం, అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల సంకేతాల నేపథ్యంలో బంగారం ధర వరుసగా రెండో రోజూ తగ్గింది. బుధవారం ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం 10 గ్రాముల ధర రూ.700 తగ్గి రూ.1,48,900కు చేరింది. ఇది వారం రోజుల కనిష్ఠ ధర. మంగళవారం బంగారం ధర రూ.1,49,600గా నమోదైంది. సెప్టెంబర్ 29న రూ.1,48,600గా ఉంది. అంతర్జాతీయంగా బలహీన సంకేతాలతోపాటు రిటైల్ డిమాండ్ తగ్గడం పసిడి ధరలపై ఒత్తిడి పెంచిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ తెలిపారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ముడిచమురు ధరలు పెరగడం కూడా బంగారానికి ప్రతికూలంగా మారిందన్నారు. అయితే



రూపాయి విలువ క్షీణించడం ధర మరింత తగ్గకుండా అడ్డుకుందని విశ్లేషకులు పేర్కొన్నారు. డాలర్‌తో రూపాయి మారకం విలువ 43 పైసలు తగ్గి రూ.96.78 వద్ద ముగిసింది. ఇక వెండి ధరలో ఎలాంటి మార్పు లేదు. వరుసగా మూడో సెషన్‌లోనూ కిలో రూ.2.27 లక్షల వద్ద స్థిరంగా కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ బంగారం ఔన్సుకు 1.14 శాతం తగ్గి 4,116.55 డాలర్లకు చేరగా, వెండి 2.26 శాతం క్షీణించి 59.97 డాలర్లకు పడిపోయింది. జూలై 9 తర్వాత వెండి ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశ వివరాల కోసం పెట్టుబడిదారులు ఎదురుచూస్తున్నారని ముడ్రెక్స్ విశ్లేషకుడు అక్షత్ సిద్ధాంత్ తెలిపారు. వడ్డీరేట్లపై ఫెడ్ తదుపరి వైఖరికి ఆ వివరాలు సంకేతాలివ్వవచ్చన్నారు. 18 నెలల గరిష్ఠానికి సమీపంలో ఉన్న డాలర్ బలపడటం కూడా బంగారం ధరలకు ప్రతికూలంగా మారిందని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం, రూపాయి బలహీనత నేపథ్యంలో ఆర్‌బీఐ కీలక వడ్డీరేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చిన విషయం తెలిసిందే. భవిష్యత్తులో మరిన్ని పెంపులు ఉండొచ్చన్న అంచనాలు మార్కెట్‌లో ఉన్నాయి.


ధనుష్ రాజకీయ రంగ ప్రవేశం ఖాయమేనా?



తమిళ స్టార్ హీరో ధనుష్ రాజకీయ రంగ ప్రవేశంపై కోలీవుడ్‌లో జోరుగా చర్చ సాగుతోంది. 'తమిళగ ఎళుచ్చి కళగం' (తమిళనాడు పురోగమన పార్టీ) పేరుతో రాజకీయ పార్టీని ఏర్పాటు చేసేందుకు ఎన్నికల సంఘం వద్ద పేరు నమోదు చేయించారంటూ ప్రచారం జరుగుతోంది. త్వరలోనే తన రాజకీయ ప్రవేశంపై ధనుష్ అధికారిక ప్రకటన చేయనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనలో ధనుష్ ఉన్నారని, ఇందుకోసం తన మామ, సూపర్‌స్టార్ రజినీకాంత్ మద్దతు కూడా కోరినట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గత కొన్ని నెలలుగా ధనుష్ తన అభిమాన సంఘాలతో వరుస సమావేశాలు నిర్వహించడం, వాటిని బలోపేతం చేయడం, అభిమానులను సేవా కార్యక్రమాల వైపు మళ్లించడం ఈ ఊహాగానాలకు మరింత ఊతమిస్తోంది. అభిమాన సంఘాలను సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా చేయడం కూడా ఆయన రాజకీయ ప్రవేశానికి సన్నాహాలేనన్న అనుమానాలకు కారణమవుతోంది. ధనుష్ రాజకీయాల్లోకి వస్తారంటూ ఇప్పటికే అనేక వార్తలు వస్తున్నప్పటికీ, ఆయన మాత్రం ఇప్పటివరకు దీనిపై ఎలాంటి అధికారిక స్పందన ఇవ్వలేదు. మరోవైపు, ధనుష్ నిజంగానే రాజకీయ అరంగేట్రం చేస్తే రజినీకాంత్‌కు నెరవేరని రాజకీయ కోరిక అల్లుడు ధనుష్ ద్వారా నెరవేరుతుందని అభిమానులు భావిస్తున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగు తోంది. అయితే పార్టీ ఏర్పాటు, ఎన్నికల్లో పోటీ, రజినీకాంత్ మద్దతు వంటి అంశాలపై ధనుష్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు ఇవన్నీ ప్రచారంగానే కొనసాగనున్నాయి.


తమిళ ప్రయాణం మరచిపోలేని అనుభవం

యంగ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా 'సిగ్మా' చిత్రంతో కోలీవుడ్ ఇండస్ట్రీకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చింది. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కిన ఈ యాక్షన్ అడ్వెంచర్ డ్రామాలో సందీప్ కిషన్ హీరోగా నటించగా, జాసన్ సంజయ్ దర్శకత్వం వహించారు. అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఫరియా అబ్దుల్లా 'సిగ్మా' చిత్రంతో పాటు తన తమిళ సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. దర్శకుడు జాసన్ సంజయ్‌తో కలిసి పనిచేయడం తనకు నిజంగా అద్భుతమైన అనుభూతిని ఇచ్చిందని ఫరియా తెలిపారు. తాను ఏం తెరకెక్కించాలనుకుంటున్నారనే విషయంలో జాసన్ సంజయ్‌కు ఎంతో స్పష్టత, ఆత్మవిశ్వాసం ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఆయనలో కనిపించిన అదే ఉత్సాహం చిత్రబృందంలోని ప్రతి ఒక్కరిలోనూ జోష్ నింపిందని చెప్పారు. అందరం కలిసి ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో ఆస్వాదిస్తూ పనిచేశామని, షూటింగ్ సమయంలో ప్రతి అనుభవాన్ని ఎంజాయ్ చేశామని ఫరియా వెల్లడించారు. 'సిగ్మా'తో తన తమిళ సినీ ప్రయాణాన్ని ప్రారంభించడం ఎంతో ప్రత్యేకమైన అనుభవమని ఆమె పేర్కొన్నారు. కొత్త పరిశ్రమలో తొలి అడుగులు వేస్తున్న సమయంలోనే మంచి ప్రాజెక్ట్‌లో భాగం కావడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా సినిమాను థియేటర్లలో ప్రేక్షకులతో కలిసి చూస్తూ, వారి నుంచి వస్తున్న స్పందనను గమనిస్తుంటే ఈ ప్రయాణం మరింత అందమైనదిగా, మరపలేనిదిగా మారుతోందని ఫరియా సంతోషం వ్యక్తం చేశారు. 'సిగ్మా' చిత్రంలో భాగం కావడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, ప్రేక్షకుల నుంచి లభిస్తున్న అద్భుతమైన ఆదరణ మరింత సంతోషాన్ని కలిగిస్తోందని తెలిపారు. తన తమిళ ప్రయాణానికి 'సిగ్మా' మంచి ఆరంభంగా నిలిచిందని ఫరియా అభిప్రాయపడ్డారు. సినిమా విడుదల తర్వాత ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతున్నాయి.



ఓటీటీలోకి రవితేజ మేనల్లుడి 'మారెమ్మ'

మాస్ మహారాజా రవితేజ కుటుంబం నుంచి హీరోగా పరిచయమైన మాధవ్ తొలి చిత్రం 'మారెమ్మ' ఓటీటీ బాట పట్టింది. రవితేజ తమ్ముడి కొడుకుగా సినీ రంగంలోకి అడుగుపెట్టిన మాధవ్.. తెలంగాణ నేపథ్యంతో తెరకెక్కిన ఈ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకులను పలకరించారు. మంచాల నాగరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మయూర్ రెడ్డి బండారు నిర్మించగా, మాధవ్‌కు జోడీగా దీపా బాలు నటించారు. భారీ అంచనాల మధ్య సెప్టెంబర్ 10న థియేటర్లలో విడుదలైన 'మారెమ్మ' బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. దీంతో థియేట్రికల్ రన్ పూర్తయ్యేలోపే డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. సాధారణంగా సినిమాలు థియేటర్లలో విడుదలైన కొంతకాలం తర్వాత ఓటీటీలోకి వస్తుండగా.. 'మారెమ్మ' మాత్రం విడుదలైన నెల రోజులకే డిజిటల్ వేదికపైకి రావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో అధికారికంగా ప్రకటన చేసింది. అక్టోబర్ 9 నుంచి 'మారెమ్మ' చిత్రాన్ని అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ చేయనున్నట్లు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించింది.



దసరా బరిలో 'క్రేజీ కళ్యాణం'

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న 'క్రేజీ కళ్యాణం' చిత్రం దసరా బరిలో సందడి చేసేందుకు సిద్ధమైంది. నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, 'రాజ్ వెడ్స్ రాంబాయి' ఫేమ్ అఖిల్ ఉద్దెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్నారు. యారో సినిమాస్ బ్యానర్‌పై బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. తొలుత ఈ చిత్రాన్ని అక్టోబర్ 30న థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ నిర్ణయించారు. అయితే అక్టోబర్ 9న విడుదల కావాల్సిన 'ఆదర్శ కుటుంబం' వాయిదా పడటంతో తమ విడుదల ప్రణాళికను మార్చుకున్నారు. అనుకున్న తేదీ కంటే రెండు వారాలు ముందుగానే దసరా కానుకగా అక్టోబర్ 16న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించి సినీ ప్రియులను సర్‌ప్రైజ్ చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇందులో అనుపమ పరమేశ్వరన్ పెళ్లికూతురు గెటప్‌లో గుమ్మం దాటి పరుగులు తీస్తుండగా.. నరేష్, తరుణ్ భాస్కర్, పెళ్లికొడుకు గెటప్‌లో ఉన్న అఖిల్ ఉద్దెమారి ఆమెను ఆపేందుకు గుమ్మం లోపలి నుంచి అరుస్తున్నట్లుగా పోస్టర్‌ను ఫన్నీగా డిజైన్ చేశారు. ఈ ఆసక్తికరమైన పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతోంది. దసరా పండుగ వేళ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రేక్షకులను నవ్వించేందుకు 'క్రేజీ కళ్యాణం' ముహూర్తం ఖరారైంది.

మౌళి 'దొంగ నా కొడుకు'కు కొత్త రిలీజ్ డేట్

'లిటిల్ హార్ట్స్' సినిమాతో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న యువ నటుడు మౌళి తనుజ్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై శ్రీను కంబాల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'దొంగ నా కొడుకు' చిత్రంలో మౌళి హీరోగా నటిస్తున్నాడు. రాబరీ, క్రైమ్, కామెడీ అంశాల మేళవింపుతో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. 'నవంబర్ 13న థియేటర్లలోకి రానున్న ఈ క్రైమ్ కామెడీ కోసం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈసారి తన అత్యంత విచిత్రమైన కుటుంబంతో కలిసి, మిమ్మల్ని నవ్వించడానికి అతను వచ్చేస్తున్నాడు' అంటూ నవంబర్ 13న సినిమాను థియేటర్లలోకి తీసుకురానున్నట్లు అధికారికంగా వెల్లడించింది.




రవితేజ సినిమాలో అనస్వర రాజన్?

టాలీవుడ్‌లో మలయాళ ముద్దుగుమ్మ అనస్వర రాజన్ పేరు మార్మోగిపోతోంది. అందంతో పాటు అద్భుతమైన నటనతో ఆకట్టుకుంటున్న ఈ భామ ప్రస్తుతం దక్షిణాది చిత్ర పరిశ్రమలో మోస్ట్ వాంటెడ్ కథానాయికగా మారుతోంది. తెలుగు, తమిళ భాషల్లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న అనస్వరపై టాలీవుడ్ అగ్ర హీరోలు, దర్శకనిర్మాతలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 'ఛాంపియన్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువై మంచి విజయాన్ని అందుకున్న ఆమె.. తాజాగా మరిన్ని క్రేజీ ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కించుకుంటోంది. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'కాకా'లో కీలక పాత్రలో కనిపించనుండగా, అశోక్ గల్లా సరసన 'ఇట్లు అర్జున' చిత్రంలోనూ నటిస్తోంది. ఇలా వరుస అవకాశాలతో ఫుల్ బిజీగా ఉన్న అనస్వర ఖాతాలో తాజాగా మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మాస్ మహారాజా రవితేజ, టాలెంటెడ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న పవర్ ప్యాక్డ్ మూవీ 'ఆర్‌టీ–79'లో అనస్వరను ఓ కీలక పాత్ర కోసం ఎంపిక చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. తెలుగు తెరకు పరిచయమైన అతి తక్కువ సమయంలోనే అగ్ర కథానాయకుల సినిమాల్లో వరుస అవకాశాలు అందుకుంటూ అనస్వర తనదైన గుర్తింపు తెచ్చుకుంటోంది. రవితేజ–వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో రూపొందనున్న 'ఆర్‌టీ–79'లో అనస్వర పాత్ర ఎలా ఉండబోతోంది? ఆమె పాత్రకు కథలో ఎలాంటి ప్రాధాన్యం ఉంటుంది? ఆమె గ్లామర్‌తో పాటు నటన ఏ స్థాయిలో ఆకట్టుకోనుంది? అనే ఆసక్తి ఇప్పుడు ప్రేక్షకుల్లో నెలకొంది. ఈ వార్త నిజమైతే అనస్వరకు తెలుగులో మరో బలమైన అవకాశం దక్కినట్టేనని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

సినిమాకు ప్రాంతీయ గోడలెందుకు?

తొలి మహిళా బుర్రకథ కళాకారిణి గరివిడి లక్ష్మి జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'గరివిడి లక్ష్మి'. ఆనంది ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి గౌరీ నాయుడు జమ్ము దర్శకత్వం వహించారు. రాగ్ మయూర్, నరేష్, రాశి, శరణ్య ప్రదీప్ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో నటుడు నరేష్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. సినీ పరిశ్రమలో తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర సినిమా అంటూ ప్రాంతాల వారీగా ముద్రలు వేయడం కొందరికి ఫ్యాషన్‌గా మారిందని నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాంతీయ భేదాలను పక్కనపెట్టి ప్రేక్షకులు స్వచ్ఛమైన మనసుతో 'గరివిడి లక్ష్మి' చిత్రాన్ని ఆదరిస్తారని తాను సవాల్ చేసి చెబుతున్నానన్నారు. సంగీతానికి, పాటలకు ఎలాంటి సరిహద్దులు లేనట్లే సినిమాకు కూడా ప్రాంతీయ గోడలు ఉండకూడదని పేర్కొన్నారు. కొరియన్, తమిళ, మలయాళ చిత్రాలను మనసారా అభినందించే మనం.. మన సొంత గడ్డపై తెరకెక్కే సినిమాలను మాత్రం ప్రాంతాల వారీగా విభజించి చూడటం సరైన పద్ధతి కాదన్నారు. తెలుగు నేలపై పుట్టిన ప్రతి ఒక్కరికీ 'గరివిడి లక్ష్మి' సినిమా మన మట్టి సువాసనను గుర్తుచేస్తుందని, ఇక్కడి నిజాయితీయే అసలైన వినోదమని నరేష్ పేర్కొన్నారు.





తేజ సజ్జా హోస్ట్‌గా 'ది ట్రైటర్స్' షో

టాలీవుడ్ యువ హీరో తేజ సజ్జా హోస్ట్‌గా వ్యవహరిస్తున్న రియాలిటీ షో 'ది ట్రైటర్స్' సందడి చేసేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో అక్టోబర్ 15 నుంచి ఈ షో స్ట్రీమింగ్ కానున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. మోసం, మారుతున్న స్నేహాలు, ఊహించని మలుపులతో సాగనున్న ఈ షోకు సంబంధించిన ఆసక్తికరమైన ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు. 'మోసం, మారుతున్న స్నేహాలు, ఊహించని ట్విస్టులతో 'ది ట్రైటర్స్' రాబోతోంది.. అత్యంత దారుణమైన ద్రోహానికి రంగం సిద్ధమైంది' అంటూ విడుదలైన ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. వివిధ రంగాలకు చెందిన మొత్తం 20 మంది కంటెస్టెంట్లు ఈ రియాలిటీ షోలో పాల్గొంటున్నారు. చిన్మయి, హర్షవర్ధన్, ప్రగతి, శ్రీదేవి, నిఖిల్, విద్యు రామన్, విష్ణు ఓయ్, శ్రావ్య, మేఘనాథ్, మౌనీషా, స్వీకర్ అగస్తి, ఆశికా, వర్షా డిసౌజా, ప్రణవ్ అలియాస్ అభినవకవి, వర్ధన్, రహత్, గౌరవ్, సాయి రోనక్, పుష్పాల ధనుంజయ్, ఫల్గుణి ఇందులో సందడి చేయనున్నారు. వీరిలో కొందరు ట్రైటర్స్‌గా, మరికొందరు ఇన్నోసెంట్స్‌గా వ్యవహరించనున్నట్లు సమాచారం. తమ మధ్య దాగి ఉన్న ట్రైటర్స్‌ను ఇన్నోసెంట్స్ గుర్తించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కంటెస్టెంట్ల మధ్య అనుమానాలు, వాగ్వాదాలు, ఉత్కంఠభరితమైన పరిస్థితులు చోటుచేసుకోనున్నట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. అయితే అసలు ట్విస్టులను బయటపెట్టకుండా మేకర్స్ షోపై మరింత ఆసక్తిని పెంచారు. ఊహించని మలుపులు, స్నేహాల మధ్య ద్రోహం, ఒకరిపై ఒకరికి కలిగే అనుమానాలతో సాగనున్న 'ది ట్రైటర్స్' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

'అట్టహాసం' ఫస్ట్‌లుక్ విడుదల

'కేరాఫ్ కంచరపాలెం'తో టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు వెంకటేష్ మహా మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల 'రావు బహదూర్' చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఆయన, ఇప్పుడు 'అట్టహాసం' పేరుతో వినోదాత్మక చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు కథ రాయడంతో పాటు దర్శకత్వం వహిస్తున్న వెంకటేష్ మహా ప్రధాన పాత్రలోనూ కనిపించనున్నారు. తాజాగా చిత్రబృందం 'అట్టహాసం' ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ''కంచరపాలెం గడ్డ నుంచి మరో కథ వచ్చేసింది.. జీవితం ఊహించని మలుపులతో కూడుకున్నది. కాబట్టి కొన్నిసార్లు మనం చేయగలిగింది ఒక్కటే.. అదే నవ్వడం'' అంటూ పోస్టర్‌కు ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇందులో కార్తీక్ రత్నం, పావని కరణం, స్రవంతి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీ చక్రాస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న 'అట్టహాసం'ను వచ్చే ఏడాది వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ హింట్ ఇచ్చారు. ఆద్యంతం వినోదభరితంగా సాగే ఈ కామెడీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుందని చిత్రబృందం చెబుతోంది.



Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.